

ఆక్రమణల తొలగింపు అనంతరం విశాలంగా ఉన్న కొత్తపట్నం బస్టాండ్ సెంటర్

ఒంగోలు నగరం రూపురేఖలు మారిపోతున్నాయి. ప్రధానంగా రోడ్ల విస్తరణ ప్రారంభమైంది. ఇప్పటికే పలు రహదారుల పనులు ముమ్మ రంగా సాగుతున్నాయి. మరికొన్నింటికి రంగం సిద్ధమైంది. ఈసారి ప్రభుత్వపరంగా నిధుల విషయంలో ప్రతికూల పరిస్థితులు ఉండటంతో తొలుత కార్పొరేషన్ పరిధిలో అందుబాటులో ఉన్న నిధులతో కీలకమైన ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ ప్రారంభించారు. అలా ప్రస్తుతం సీవీఎన్ రీడింగ్ రూం, లాయర్‌పేట ప్రకాశం పంతులు విగ్రహం కూడలి, కొత్తపట్నం బస్టాండు సెంటర్ వంటి వాటితోపాటు పలు ఇతర రోడ్లు, కూడళ్ల వద్ద విస్తరణ చేసి సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. మరికొన్ని ప్రధాన కాలువలను పెద్దవిగా చేసి డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరుస్తున్నారు. ప్రధాన రోడ్ల మధ్య ఉన్న డివైడర్లపై పచ్చదనం, ఇతర ఆహ్లాదకర వాతావరణ చర్యలు చేపట్టారు. ఇప్పుడు మరికొన్ని రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించారు.

ప్రగతి దారులు

ఒంగోలులో కీలక రోడ్ల విస్తరణ
పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి, విస్తరణకు ప్రతిపాదించిన ఒంగోలులోని శ్రీనివాసథియేటర్ రోడ్డు

80 అడుగులతో ట్రంకురోడ్డు, 60 అడుగులుగా కొత్తపట్నం రోడ్డు

- మంగమూరు రోడ్డు 80 నుంచి 100 అడుగులు
- అన్నింటికీ మధ్యలో డివైడర్ ఏర్పాటు
- త్రోవగుంట నుంచి శ్రీనివాస థియేటర్ వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి
- ఎస్ఎస్ ట్యాంకు-1 వద్ద ఫుడ్ కోర్టు
- ఇప్పటికే కార్యాచరణ ప్రారంభం
- నిధుల కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు

ఒంగోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్, నగర విస్తరణ, జనం రద్దీ నేపథ్యంలో ఒంగోలు నగరంలోని పలు రహదారుల విస్తరణ, అభివృద్ధిపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టి సారించారు. అవకాశం ఉన్న మేర ప్రజలకు ఆహ్లాద వాతావరణంతోపాటు నగర సుందరీకరణ, పచ్చదనం పెంపు తదితరాలకు సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రధానంగా నగరంలో తీవ్ర రద్దీ పరిస్థితి ఉంటూ వన్‌వే పెట్టినా రాకపోకలు సజావుగా సాగే అవకాశం లేని ట్రంకురోడ్డు, కొత్తపట్నం రోడ్డు విస్తరణపై దృష్టి సారించారు. ట్రంకురోడ్డు ప్రస్తుతం 40 అడుగులు ఉండగా దానిని కనీసం 80 అడుగుల వెడల్పు లక్ష్యంగా చర్యలు ప్రారంభించారు. తొలుత ఒకేసారి వంద అడుగులకు విస్తరణ చేయాలని భావించినా వ్యాపారుల నుంచి వచ్చిన వినతులు, వారి సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకొని 80 అడుగులకే పరిమితం చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దాని వల్ల దుకాణాలు కోల్పోయే వారికి ప్రత్యామ్నాయంగా పాత మార్కెట్ వద్ద పీపీపీ పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి షాపుల కేటాయింపు లేదా టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. దీనికి ఎక్కువ మంది వ్యాపారులు అంగీకరించినట్లు సమాచారం. కొందరు కోర్టును ఆశ్రయించడంతో అలాంటి వారి విషయంలో చట్టప్రకారం వ్యవహరించే యోచనలో ఎమ్మెల్యే, మునిసిపల్ పాలకవర్గం ఉన్నట్లు తెలుస్తోంది. మరో వన్‌వే అయిన కొత్తపట్నం బస్టాండ్ రోడ్డును 60 అడుగుల మేర విస్తరించే యోచన చేస్తున్నారు. వివిధ వర్గాల

మిగతా 6వ పేజీలో


కీలక ప్రత్యామ్నాయ మార్గంపై దృష్టి

మరో ప్రధానమైనదిగా ఉన్న నగరంలోని పాత మార్కెట్ ఎదురు సెయింట్ థెరిస్సా స్కూలు నుంచి శ్రీనివాస థియేటర్ మీదుగా నగరంలోని పలు పేదల కాలనీలను కలుపుతూ ముక్తినూతలపాడు వెళ్లే రోడ్డును కూడా 100 అడుగుల వెడల్పు అభివృద్ధికి ప్రతిపాదించారు. ముక్తినూతలపాడు నుంచి త్రోవగుంట ఎన్టీఆర్ విగ్రహం వరకూ దీన్ని పొడిగించనున్నారు. తద్వారా ఒంగోలు రూరల్ మండలంలోని కరవది వైపు గ్రామాల నుంచి వచ్చేవారు బైపాస్‌కు వెళ్లే పనిలేకుండా నగరంలోకి నేరుగా వచ్చేందుకు వీలు కూడా కలుగుతుంది. ఆ రోడ్డులో భాగంగా ముదిగొండి వాగుపై కల్వర్టు, పోతురాజు కాలువపై కొత్త వంతెన కూడా నిర్మించనున్నారు. సుమారు రూ.24 కోట్లు అవసరంగా అంచనా వేశారు.

అంతర్ జిల్లా బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

- 34 మంది టీచర్లు ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు
- 36 మంది ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు స్థానచలనం



ఒంగోలు విద్య, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారుల అంతర్ జిల్లాల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇతర జిల్లాల నుంచి వివిధ కేడర్ల టీచర్లు 34మంది ఇక్కడకు బదిలీ మీద రాగా, ఇక్కడి నుంచి 36 మంది ఇతర జిల్లాలకు వెళ్తున్నారు. బదిలీ అయిన టీచర్లను డీఈవో కిరణ్‌కుమార్ గురువారమే రిలీవ్ చేశారు. ఇక్కడకు బదిలీపై వస్తున్న వారు శుక్ర వారం నుంచే ఇక్కడి డీఈవో కార్యాలయంలో రిపోర్టు

మిగతా 6వ పేజీలో

14 మందికి ఎస్‌ఏలుగా ఉద్యోగోన్నతి

హైకోర్టు ఆదేశాలతో భాషా పండితులకు ప్రమోషన్

వివరాలు 6వ పేజీలో..



ఒంగోలులో ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, కలెక్టర్ రాజాబాబు, మేయర్ సుజాత, టీడీపీ దర్శి ఇన్‌చార్జి లక్ష్మి

జీఎస్టీ 2.0తో అందరికీ మేలు

- జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు
- ఒంగోలులో పాల్గొన్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్ రాజాబాబు
- ఇతర ప్రాంతాల్లో వివిధ శాఖల ద్వారా సభలు
- వ్యాపార వర్గాలతో దినకర్ సమావేశం
- నగరంలో పలుచోట్ల తనిఖీలు

ఒంగోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్నివర్గాల వారికి మేలు జరుగుతుందని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు వివరిస్తున్నారు. ఇందు కోసం జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టారు. గతంలో ఉన్న వాటి స్థానంలో రెండు శ్లాబుల విధానాన్ని గతనెల 22 నుంచి కేంద్రం అమలులోకి తెచ్చిన విషయం విదితమే. గతంలో 5, 12, 18, 28 శాతం జీఎస్టీ శ్లాబులు ఉండగా ప్రస్తుతం 5, 18 శాతం శ్లాబులు అమలులో వచ్చాయి. ఈ సంస్కరణల ద్వారా కొన్ని వస్తువులపై పన్ను పూర్తిగా రద్దుచేయగా, మరికొన్నింటిపై తగ్గించారు. పండుగ సమయంలో అన్ని వర్గాల వారికి ఇది ఊరట కలిగించింది. ఆమేరకు కొనుగోళ్లు కూడా పెరిగాయి.

భారీ ట్రాక్టర్ల ర్యాలీ

జీఎస్టీ తగ్గింపుపై నెలరోజులపాటు ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమలను చేపట్టాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. తదనుగుణంగా జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆ కార్యక్రమాలు చేపట్టారు. వ్యవసాయ, అనుబంధ రంగాల యంత్రాలపై పన్ను భారీగా తగ్గిన నేపథ్యంలో ఆ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ఒంగోలులోని

మిగతా 6వ పేజీలో

దేవుడు భూమికే ఎసరు!

- దసరా సందట్లో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ స్థలంపై కన్ను
- రూ.20కోట్ల విలువైన భూమిలో కొంతభాగం చదును
- ఒంగోలులో వెలుగులోకి వచ్చిన ఆక్రమణ
- అప్రమత్తమైన దేవదాయ శాఖ అధికారులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జనమంతా విజయ దశమి వేడుకల్లో నిమగ్నమై ఉండగా, కొందరు భూకబ్జాదారులు ఏకంగా దేవుడు భూమికే ఎసరు పెట్టారు. కాశీవిశ్వేశ్వరస్వామికే శఠగోపం పెట్టాలని చూశారు. గత వైసీపీ హయాంలో నగరంలో భూకబ్జాలు అడ్డూ అదుపు లేకుండా సాగాయి. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం వచ్చాక కూడా అదే పంథా కొనసాగుతోంది. ఒంగోలు కొండ మీద ఉన్న శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూములు సుజాతనగర్ సమీపంలో ఉన్నాయి. 37వ డివిజన్‌లోని సర్వే నెం.225లో సుమారు 27.5 ఎకరాలు ఉండగా గతంలో అదే భూమిపై వైసీపీ నాయకులు కన్నేసి ఆక్రమించే ప్రయత్నం చేశారు. ఈ స్థలం విలువ మార్కెట్ ప్రకారం సుమారు రూ.20కోట్లపైనే ఉంటుందని అంచనా. దేవదాయ శాఖ అధికారులు అప్రమత్తమై అడ్డుకోవడంతో అప్పట్లో ఆగిపోయింది. కాగా తాజాగా జనమంతా దసరా వేడుకల్లో

మిగతా 6వ పేజీలో



ఆక్రమణదారులు చదును చేసిన దేవదాయ భూమి

గాంధీ స్ఫూర్తితో అభివృద్ధికి చర్యలు

- మంత్రి డాక్టర్ శ్రీబాలవీరాంజనేయస్వామి
- ఒంగోలులో గ్రామ చావిడి పునర్నిర్మాణానికి శంకుస్థాపన

7



పార్వేట సందర్భంగా ఒంగోలు గాంధీరోడ్డులో 'ప్రణవాలయ పాహి.' గీతానికి నాట్యం చేస్తున్న విద్యార్థినులు

అంబరాన దసరా సంబరం



దసరా సంబరాలు గురువారం జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటాయి. ఇంటింటా ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. వేకువజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాత్రికి పలుచోట్ల పార్వేటలు వైభవంగా నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్



ఆటో డ్రైవర్లకు పండుగ

- నేడు వారి ఖాతాలలో రూ.15వేలు జమ
- ప్రతి నియోజకవర్గ కేంద్రంలో కార్యక్రమం
- ఒంగోలులో పాల్గొననున్న ఇన్‌చార్జి మంత్రి ఆనం
- ఎక్కడికక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్ల కోసం ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకంలో భాగంగా ఒక్కొక్కరికి రూ.15వేలు లబ్ధి అందించనుంది. ఆ మొత్తాన్ని శనివారం నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో జమచేయనుంది. జిల్లాలో 12,091 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆటోలతో భారీ ర్యాలీలు నిర్వహించనున్నారు.

జిల్లా కేంద్రంలో 500 ఆటోలతో ర్యాలీ

ఒంగోలులో 500 ఆటోలతో ర్యాలీ నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రకాశం భవన్ వరకు ఇది సాగనుంది. ఆతర్వాత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మిగిలిన అన్ని నియోజకవర్గాలలో ఆటో డ్రైవర్లకు నగదు పంపిణీ కార్యక్రమం


మిగతా 6వ పేజీలో

సాగర్ నీటి పంపిణీలో మతలబు

- రీడింగ్‌లో భారీగా తేడాలు
- వస్తున్న దానికంటే అధికంగా చూపుతున్న వైనం
- ఆయకట్టు రైతులకు అన్యాయం

దర్శి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కాలువలకు నీటి పంపిణీలో చివరి ప్రాంతాలకు అన్యాయం జరుగుతోంది. రీడింగ్‌లో తేడాలతో జిల్లాకు తక్కువ నీరు విడుదల అవుతున్నప్పటికీ ఎక్కువ సరఫరా అవుతున్నట్లు చూపుతోంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు రెగ్యులేటర్ వద్ద పూడిక పేరుకుపోవడంతోపాటు రీడింగ్ పట్టికలో తేడా ఉన్నందున నీటి లెక్కల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. దర్శి బ్రాంచ్ కాలువ వద్ద రీడింగ్‌లోనూ తేడాలు ఉన్నాయి. ఈ కారణంగా సుమారు 400 క్యూసెక్కుల నీరు తక్కువగా వస్తోంది. దీంతో రైతులకు నష్టం జరుగుతోంది. ప్రస్తుతం రీడింగ్ ప్రకారం సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు (ప్రకాశం సరిహద్దు) వద్ద 2,740 క్యూసెక్కులు వస్తోంది. అయితే వాస్తవానికి అక్కడ 2,400 మాత్రమే సరఫరా అవుతోంది. అక్కడి నుంచి దర్శి

మిగతా 6వ పేజీలో



సాగర్ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు

ఆగిన టిప్పర్‌ను మోటారు సైకిల్ ఢీకొని ఇద్దరు యువకుల మృతి

వివరాలు 7వ పేజీలో..

వనం-మనం మధ్యలో వన్యప్రాణి

- అవి ప్రకృతి అందించిన వరం
- వాటిని కాపాడుకోవడం అందరి బాధ్యత
- ఈనెల 8వ తేదీ వరకు వన్యప్రాణి సప్తాహం

7

జిల్లాకు స్వచ్ఛాంధ్ర అవార్డులు

- మూడు రాష్ట్రస్థాయి, 49 జిల్లాస్థాయి పురస్కారాలు
- ప్రకటించిన కలెక్టర్ రాజాబాబు
- 6న విజయవాడలో ప్రదానం

వివరాలు 7వ పేజీలో..



బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.



రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు



నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, ఆనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిధున్, విశాఖపట్నానికి చెందిన స య్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు



హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయుకుడు యనమల నాగార్జునయాదవ్

14 మందికి ఎస్ఏలుగా ఉద్యోగోన్నతి

- హైకోర్టు ఆదేశాలతో భాషా పండితులకు ప్రమోషన్

ఒంగోలు విద్య, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న 14 మంది భాషా పండితులకు స్కూలు అసిస్టెంట్లుగా అడ్‌హక్ ఉద్యోగోన్నతులు కల్పించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. భాషాపండితుల ఉద్యోగోన్నతుల వ్యవహారం గత కొంతకాలంగా హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. గతంలో గ్రేడ్-2 భాషాపండితులు, అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన స్కూలు అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం ఉద్యోగోన్నతులు ఇచ్చారు. ఆ తర్వాత కేవలం సంబంధిత గ్రేడ్-2 భాషా పండితులకు మాత్రమే ఆయా భాషల్లో స్కూలు అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు ప్రక్రియను డీఈవో చేపట్టారు. దీంతో ఉద్యోగోన్నతి కోల్పోతున్న ఎస్జీటీలు ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారికి కూడా స్కూలు అసిస్టెంట్ భాషల ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ చేసింది. ప్రభుత్వ అప్పీల్‌ను సమర్థిస్తూ కేవలం భాషా పండితులకు మాత్రమే ఉద్యోగోన్నతులు ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ఆరుగురు తెలుగు, ముగ్గురు హిందీ, ముగ్గురు ఉర్దూ, ఇద్దరు సంస్కృత గ్రేడ్-2 భాషాపండితులకు స్కూలు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు ఇచ్చారు. ఈ ప్రమోషన్లు రిట్ అప్పీల్ తుది ఉత్తర్వులకు లోబడి ఉంటుందని వీరి నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అదరహో.. ఆర్ఎల్‌పురం!

- చీమకుర్తి సీహెచ్‌సీకి రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డు

చీమకుర్తి, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి) : గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ అవార్డులలో చీమకుర్తికి రెండు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా రాష్ట్రం మొత్తం మీద ఐదు పంచాయతీలను ప్రభుత్వం ఎంపిక చేయగా వాటిలో ఒకటి మండలంలోని ఆర్ఎల్‌పురం పంచాయతీ ఉండటం విశేషం. స్వచ్ఛ సీహెచ్‌సీగా చీమకుర్తి పట్టణంలోని కమ్యునిటీ హెల్త్ సెంటర్‌ను రాష్ట్రస్థాయిలో ఎంపిక చేశారు. ఈనెల 6వ తేదీన విజయవాడలో ప్రభుత్వం అవార్డు ప్రదానం చేయనుంది.

ఆర్ఎల్‌పురంలో చెత్త నుంచి సంపద సృష్టి

రాజుపాలెం లక్ష్మీపురం (ఆర్ఎల్ పురం) అనగానే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గ్రానైట్ పరిశ్రమ గుర్తుకు వస్తుంది. ఈ పంచాయతీ పరిధిలో పలు గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలు, కంకర మిల్లులున్నాయి. దాదాపు ప్రతి గ్రామంలో చెత్తసంపద కేంద్రాలు ఏర్పాటు చేసినా ఒకటీ అరా గ్రామాల్లో తప్ప ఇవి అలంకార ప్రాయంగానే నిలిచిపోయాయి. కానీ ఆర్ఎల్‌పురంలో విశాలమైన స్థలంలో కేంద్రాన్ని ఏర్పాటుచేయటమే కాకుండా అక్కడ చెత్త నుంచి సంపద సృష్టిస్తుండటం విశేషం. దాదాపు మూడువేల మంది జనాభా ఉన్న ఆర్ఎల్‌పురంలో పంచాయతీ వారు తమ వాహనాలతో ఇంటింటికి వెళ్లి క్రమం తప్పకుండా చెత్తను సేకరించటమే కాక వాటిని మూడు విభాగాలుగా వేరుచేసి ఎరువును తయారుచేస్తున్నారు. ఈ ఎరువును చుట్టుపక్కల రైతులు కొనుగోలు చేస్తుండటంతో పంచాయతీకి ఆదనంగా ఆదాయవనరు సమకూరుతోంది. గ్రామస్థులందరూ గ్రామంలో ఎక్కడా చెత్త కనపడకుండా పరిశుభ్రంగా ఉంచడంలో అధికారుల చొరవ కీలకమైంది. అందరి కృషితో గ్రామం రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. సర్పంచ్ పుల్లగూర రమణమ్మ తమ గ్రామానికి అవార్డు రావటం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ అవార్డు రావటానికి సహకరించిన గ్రామస్థులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.



పరిశుభ్రత, పచ్చదనంతో సీహెచ్‌సీ కళకళ

చీమకుర్తి పట్టణంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డు దక్కింది. డాక్టర్ వేణుగోపాలరెడ్డి వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆసుపత్రి రూపురేఖలే మారిపోయాయి. స్వచ్ఛతకు, పచ్చదనానికి పెద్దపీట వేశారు. సిబ్బంది, దాతలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సహకారంతో ఆసుపత్రిని సుందరంగా తీర్చిదిద్దారు. ఆసుపత్రిలో అడుగుపెడితే పార్కులోకి అడుగు పెట్టినట్లుంటుంది. ప్రత్యేక వ్యవస్థను ఆసుపత్రిలో ఏర్పాటుచేసి ఆసుపత్రుల్లో సహజంగా వచ్చే వాసనలు, ఆసుపత్రి అనే ఫీలింగ్ ఇక్కడ కనపడకుండా ఆసుపత్రి ఆవరణలో అనువణువునా స్వచ్ఛత తొణికిసలాడే తీర్చిదిద్దారు.

ఆటో డ్రైవర్లకు పండుగ

(5వ పేజీ తరువాయి)

జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. లబ్ధిదారులుగా ఉన్న ఆటోడ్రైవర్ల సంఖ్య గతం కంటే ఈసారి ఎక్కువగా ఉంది. 2023-24లో కేవలం 10,741మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య 12,091 మందికి పెరిగింది. అదేక్రమంలో గత ప్రభుత్వంలో రూ.10వేలు ఆటో డ్రైవర్లకు ఇవ్వగా కూటమి ప్రభుత్వం లబ్ధిని రూ.15 వేలకు పెంచడంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం ఒంగోలు రానున్నారు. నగరంలో నిర్వహించే 'ఆటో డ్రైవర్ల సేవలో' ఆయన పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు ఇక్కడి నుంచి బయల్దేరి నెల్లూరు వెళ్తారు.

దేవుడు భూమికే ఎసరు

(5వ పేజీ తరువాయి)

ఉండగా 'సందట్లో సడేమియా' అన్నట్లు కొందరు వ్యక్తులు గురువారం రాత్రి ఆ భూములను చదును చేయడం ప్రారంభించారు. కొంత భాగానికి ఎక్స్‌కవేటర్‌తో పిచ్చిమొక్కలు తొలగించి, ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నించారు. ఆ దందాను చూసిన కొందరు విషయాన్ని దేవదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళారు. వారు అప్రమత్తమై వెంటనే చర్యలు తీసుకున్నారు. కొందరు సిబ్బందిని ఆ స్థలం వద్ద కాపలాగా ఉంచడంతో ఆక్రమణదారులు సర్దుకున్నారు. దేవదాయ శాఖ నిర్లక్ష్యం వైఖరి కారణంగానే అక్రమార్కులు ఆలయ భూములను ఆక్రమిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించి, దేవదాయ శాఖకు చెందిన స్థలాలను కాపాడుకునేందుకు రక్షణ కంచెలు వేయాలని కోరుతున్నారు.

సాగర్ నీటి పంపిణీలో మతలబు

(5వ పేజీ తరువాయి)

బ్రాంచ్ కాలువ హెడ్‌కు వచ్చేసరికి 1,850 క్యూసెక్కులు సరఫరా అవుతున్నట్లు రీడింగ్ చూపుతోంది. కానీ అక్కడ 300 క్యూసెక్కులు తక్కువగా వస్తోంది. ఒంగోలు బ్రాంచ్ కాలువ హెడ్ వద్దకు వచ్చే సరికి కేవలం 750 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతున్నట్లు చెప్తున్నారు. 85/3వ మైలు నుంచి ఓబీసీ హెడ్ వరకు ఎక్కువ నీరు వాడుతున్నట్లు తప్పుడు తడకలుగా ఉన్న రీడింగ్‌లు చెబుతున్నాయి. వాస్తవంగా ఆ రీడింగ్‌లు సక్రమంగా ఉంటే ఒంగోలు బ్రాంచ్ కాలువకు అధికారులు అన్యాయం చేసినట్లుగా భావించాల్సి ఉంటుంది.

బయటకు చెప్పేందుకు సాహసించని అధికారులు

వాస్తవంగా అక్కడ రీడింగ్‌లు తప్పుగా ఉన్న విషయాన్ని స్థానిక అధికారులు బయటకు చెప్పలేకపోతున్నారు. ఈవిషయం బయటకు చెబితే గుంటూరు జిల్లా ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఎంతోకాలంగా మిన్నకుండిపోయారు. రీడింగ్‌ల తప్పులను సరిచేసే అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకోలేదు. హైదరాబాద్‌లో అకౌంటిక్ డ్రాపులర్ కరెంట్ ప్రొఫైలర్‌తో రీడింగ్‌ను చెక్‌చేస్తే లోపాలు బహిర్గతమవుతాయి. ఆతర్వాత గేజింగ్ మీటర్ లెవల్స్ సరిచేస్తే రీడింగ్స్ సక్రమంగా వస్తాయి. లెవల్స్ సరిచేయాలంటే ఇప్పుడు సాధ్యం కావడం లేదు. నీరు విడుదల కాని సమయంలో పేరుకుపోయిన పూడికతీసి సరిచేయాల్సి ఉంది. దీంతో అధికారులు మిన్నకుండిపోయారు. కనీసం ఇప్పుడు తనిఖీ చేసి తేడాలను గుర్తిస్తే కొంతమేరకు తప్పును సరిచేసే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు ఈవిషయాన్ని గుర్తించి రీడింగ్స్‌లో తేడాలను సరిచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రగతి 'దారులు'

(5వ పేజీ తరువాయి)

వారితో సంప్రదింపులు, కార్పొరేషన్ పరంగా తీసుకోవాల్సిన చర్యలు కొలిక్కి వచ్చాయి. మరోవైపు నగరంలోని మంగమూరు రోడ్డు, శ్రీనివాస థియేటర్ రోడ్డుల భారీ విస్తరణ, అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. లాయర్‌పేట ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నుంచి ప్రారంభమయ్యే మంగమూరు రోడ్డు బైపాస్‌కు ఇరువైపులా దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర పూర్తిగా రద్దీగా మారింది. అలా ఓపీఎస్ వరకు భారీ నిర్మాణాలు ఉన్నాయి. అక్కడి నుంచి పశ్చిమం వైపు మరో మూడు కి.మీ మేర కూడా నివాసిత ప్రాంతంగా అభివృద్ధి చెందింది. పెద్దసంఖ్యలో నివాసాలు పెరగడం, ప్రత్యేకించి అపార్ట్‌మెంట్లు భారీగా ఉండటంతో స్కూళ్లు, కాలేజీలు పెరిగిపోయాయి. ఎగువన కొండపి ప్రాంతం నుంచి కూడా ఈ రోడ్డుపై రాకపోకలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగమూరు రోడ్డు అభివృద్ధి అవసరం అధికంగా ఉంది. దీంతో ఈ రోడ్డుపై దృష్టిసారించిన ఎమ్మెల్యే జనార్దన్ ఇప్పటికే రోడ్డు పక్కన భారీ నిర్మాణాలు ఉన్న ఓపీఎస్ వరకు 80 అడుగులుగా అక్కడి నుంచి పైన 100 అడుగుల రోడ్డు విస్తరించడంతోపాటు మధ్యలో డివైడర్లు లైటింగ్ ఇరువైపులా కాలువల నిర్మాణం ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.24కోట్లు అవసరమని అంచనా.

ఆహ్లాదం కోసం సరికొత్తగా..

నగరంలో ఆహ్లాదం, పచ్చదనంలో భాగంగా ఐదు వేల మొక్కలు నాటాలని నిర్ణయించి దాని అమలుకు చర్యలు ప్రారంభించారు. ఒకటో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద భారీ ఫుడ్ కోర్టు ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఆ ట్యాంకు పశ్చిమ, దక్షిణంవైపు దాదాపు రూ.4.5 కోట్ల వ్యయంతో ఆహ్లాదకరంగా పార్కులు, పిల్లలకు క్రీడా స్థలం, జిమ్ సెంటర్లతోపాటు వీధి వ్యాపార కేంద్రం (ఫుడ్ కోర్టు)గా ప్రత్యేకించి తినే ఆహార పదార్థాల దుకాణాలు ఏర్పాటుకు ప్రతిపాదించారు. తద్వారా నగర ప్రజలు కొన్ని గంటలపాటు అక్కడ ఆహ్లాదకరంగా గడిపేలా దీనిని ప్రతిపాదిస్తున్నారు. ఆయా పనులకు సంబంధించి నిధుల కోసం ఒకవైపు ప్రభుత్వంతో సంప్రదిస్తూనే మరోవైపు కార్పొరేషన్‌లో అందుబాటులో ఉండే నిధులతో దశలవారీగా అన్నింటినీ పూర్తిచేయనున్నట్లు ఎమ్మెల్యే జనార్దన్ చెప్పారు.

జీఎస్టీ 2.0తో అందరికీ మేలు

(5వ పేజీ తరువాయి)

డీఆర్ఆర్ఎం హైస్కూల్‌లో సభ నిర్వహించి అనంతరం నగరంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ చేపట్టారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ రాజాబాబు, డీఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రకాశం భవన్‌లో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో వ్యాపార, వాణిజ్య వర్గాలు, ఆడిటర్లతో సమావేశం నిర్వహించారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పాల్గొని కేంద్రప్రభుత్వ సంస్కరణలు వివరించారు. నగరంలో డీమార్ట్ మాల్‌లో జీఎస్టీ అమలు తీరును ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, లంకా దినకర్ పరిశీలించి వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఇతరచోట్ల కూడా పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా వ్యవసాయశాఖతోపాటు ఇతర ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు, సభలు, సమావేశాలను నిర్వహించారు.

అంతర్ జిల్లా బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. టీచర్ల అంతర్ జిల్లా బదిలీలను పరస్పర (మ్యూచువల్), భార్యాభర్తలు(స్పౌజ్)కు మాత్రమే పరిమితం చేశారు. జిల్లా నుంచి 44 మంది అంతర్ జిల్లాల బదిలీలకు దరఖాస్తు చేయగా వీరిలో 22 మంది స్పౌజ్, 22మంది పరస్పర బదిలీలు కోరుకున్నారు. స్పౌజ్ కేటగిరీ కింద బదిలీ కోసం దరఖాస్తు చేసిన 22 మందిలో 15 మందికి ఇతర జిల్లాలకు బదిలీ ఉత్తర్వులు రాగా ఏడుగురి దరఖాస్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. 13 మంది టీచర్లు ఈ కేటగిరీ కింద ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. పరస్పర బదిలీ కోసం దరఖాస్తు చేసిన 22 మందిలో 21 మందికి స్థానచలనం కల్పించారు. అంటే 21మంది ఇక్కడ నుంచి ఇతర జిల్లాలకు బదిలీ కాగా 21మంది ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు వస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వస్తున్న వారిలో స్పౌజ్ కేటగిరీ కింద పీఎస్‌హెచ్‌ఎం, స్కూలు అసిస్టెంట్ హిందీ, గణితం, సోషల్, తెలుగు-2, వ్యాయామ విద్య 4, ఎస్జీటీలు ముగ్గురు ఉన్నారు. పరస్పర బదిలీల్లో స్కూలు అసిస్టెంట్ హిందీ 2, గణితం ఒకరు, పీఎస్ ఒకరు, తెలుగు 2, సెకండరీ గ్రేడ్ తెలుగు 11, ఉర్దూ ఒకరు ఇక్కడకు వచ్చారు. గతంలో పరస్పర బదిలీ కింద ఇక్కడకు వచ్చే వారిని మ్యూచువల్ ఇచ్చిన టీచర్ల స్థానంలోనే నియమించేవారు. ప్రస్తుతం ఆ పద్ధతికి ప్రభుత్వం చెల్లుచీటీ ఇచ్చింది. కేటగిరి 3, 4 ప్రాంతాల్లోని పాఠశాలల్లో అత్యవసరమైన వాటిలో వీరిని నియమించనున్నారు. ఇక్కడకు బదిలీపైనా వచ్చిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి నియమించనున్నారు. ఆ కేడర్ సీనియారిటీ జాబితాలో వీరిని చివరి స్థానంలో ఉంచుతారు.



సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొన్న 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్

జీఎస్టీ సంస్కరణలతో వినియోగదారులకు మరింత మేలు

- ట్యాక్స్ స్లాబ్స్ రెండుకు తగ్గింపు
- 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు మరింత మేలు కలిగేలా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు చేసిందని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ వెల్లడించారు. ట్యాక్స్ స్లాబ్స్ రెండుకు తగ్గింపుతో పాటు రోజువారీ వినియోగించే అనేక వస్తువులకు సున్నా లేదా ఐదు శాతం జీఎస్టీ మాత్రమే ఉంటుందన్నారు. 99 శాతం వస్తువులు, సేవలు పన్ను రహితమన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో చార్టెడ్ అకౌంటెంట్లు, వ్యాపార ప్రతినిధులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వస్తు సేవల ఉత్పత్తి, వర్తక వాణిజ్యం నెరిపే వారికోసం ఏర్పడిన చాంబర్ ఆఫ్ కామర్స్, చార్టర్డ్ అకౌంటెంట్స్, అడ్వకేట్లు, డాక్టర్ల అవగాహన సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడం వల్ల పేద ప్రజలు, సామాన్య ప్రజలతో పాటు అన్ని వర్గాలకు మేలు చేకూరనుందన్నారు. వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ సత్యప్రకాష్, డీఆర్వో ఓబులేసు, ఒంగోలు చార్టర్డ్ అకౌంటెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరువాయికుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేవతు శ్రీరాములు, ఎస్టీపీ అసోసియేషన్ అధ్యక్షుడు రోశయ్య పాల్గొన్నారు. అనంతరం డీమార్ట్‌ను సందర్శించారు. అక్కడ వస్తువుల ధరలపై వినియోగదారులను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్ అడిగి తెలుసుకున్నారు.

ఆగిన టిప్పర్‌ను మోటారు సైకిల్ ఢీకొని

ఇద్దరు యువకులు మృతి

- చింతలపాలెం-జరుగుమల్లి మధ్య ఘటన


జరుగుమల్లి (కొండపి), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుమీద ఆగి ఉన్న టిప్పర్‌ను మోటారు సైకిల్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన చింతలపాలెం-జరుగుమల్లి గ్రామాల మధ్య బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. జరుగుమల్లి ఎస్సై బి.మహేంద్ర కథనం మేరకు.. బాపట్ల జిల్లా చీరాల పరిధిలోని ఓడరేవుకు చెందిన శ్రీరాములురాజు (20) సోదరికి చింతలపాలెం గ్రామానికి చెందిన కట్టా ప్రవీణ్ (19) అన్నతో గతంలో వివాహం జరిగింది. శ్రీరాములురాజు కుటుంబం కూడా నెలరోజులుగా చింతలపాలెంలో ఉంటూ కూలి పనులు చేసుకుంటోంది. ఈక్రమంలో బుధవారం రాత్రి చింతలపాలెం నుంచి మోటార్ సైకిల్‌పై రాజు, ప్రవీణ్ వ్యక్తిగత పనులపై టంగుటూరుకు బయల్దేరారు. చింతలపాలెం-జరుగుమల్లి గ్రామాల మధ్య పాలకేంద్రం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై టిప్పర్ మరమ్మతులకు గురై నిలిచి ఉంది. బైక్‌ను నడుపుతున్న రాజు టిప్పర్‌ను గమనించకుండా అతివేగంతో ఢీకొట్టాడు. రాజుకు మెడ తెగిపోగా, వెనుక కూర్చున్న ప్రవీణ్‌కు తల పగిలింది. ఇరువురూ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేంద్ర ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గురువారం ఉదయం మృతదేహాలను కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతులు వాడే యంత్రాలపై ఐదు శాతమే

- జీఎస్‌టీ అమలుపై ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం, అనుబంధ రంగాల రైతులు ఉపయోగించే యంత్రాలపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గింపు జరగడం వల్ల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎంపీ మాగుంట మాట్లాడారు. 2016లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జీఎస్టీని అమలులోకి తెచ్చారన్నారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ రెండు స్లాబులకే పరిమితం చేయడం ద్వారా అన్ని వర్గాల ప్రజలు వినియోగించే వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో గత నెల 22 నుంచి నెల రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ మాట్లాడారు. అనంతరం డీఆర్ఆర్ఎం స్కూలు నుంచి జీఎస్టీ తగ్గింపుపై ఏర్పాటుచేసిన ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించారు.

ఎస్పీ కార్యాలయంలో ఆయుధ పూజ



ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ దంపతులు

ఒంగోలు క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దుష్టశిక్షణ, శిష్టరక్షణకు ప్రతీకగా భావించే విజయదశమి పండుగ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయుధపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధనరాజు దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఐక్యంగా పనిచేసి పోలీసు శాఖకు మంచిపేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కేవీ.రాఘవేంద్రరావు, సీఐలు సుధాకర్, విజయకృష్ణ, దేవప్రభాకర్, జగదీష్ సిబ్బంది పాల్గొన్నారు.

వనం-మనం మధ్యలో వన్యప్రాణి

ప్రకృతి అందించిన వరం వన్యప్రాణులు

మానవ చర్యలతో వాటి మనుగడకు ముప్పు వద్దు

వాటిని కాపాడుకోవడం అందరి బాధ్యత

ఈనెల 8వ తేదీ వరకు వన్యప్రాణి సప్తాహం

మానవునికి ప్రకృతి జీవనాధారంగా నిలుస్తుంటే మానవుడు అదే జీవనాధారమైన ప్రకృతిని పరిరక్షించకపోగా దాని మనుగడకు ముప్పు వాటిల్లేలా వ్యవహరిస్తున్నాడు. మరోవైపు వన్యప్రాణులు పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతుంటే వాటి రక్షణ బాధ్యతను కూడా మనిషి విస్మరిస్తున్నాడు. అందుకే ప్రతి సంవత్సరం అక్టోబరు 2వ తేదీ నుంచి 8వతేదీ వరకు జరుపుకునే వన్యప్రాణి సప్తాహం (వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవం) కార్యక్రమం ద్వారా ప్రకృతితో పాటు వన్యప్రాణుల పరిరక్షణకు ప్రజల్లో అవగాహన కలిగించటం, వివిధ ప్రచార కార్యక్రమాలు ద్వారా వన్యప్రాణుల పట్ల ప్రేమ, పరిరక్షణ బాధ్యతను పెంపొందించేందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది. వన్యప్రాణుల కోసం ఎన్ని చట్టాలు రూపొందించినా వాటి అమలుకు ప్రజల సహకారం కూడా అవసరం.



నల్లమల అటవీ ప్రాంతం (ఫైల్)



త్రిపురాంతకం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న అటవీ సంపదలో ప్రధానమైనది నల్లమల అటవీ ప్రాంతం. ప్రకాశం జిల్లాలో 3,296 చ.కి.మీల విస్తీర్ణంలో ఉంటే అందులో ఆత్మకూరు, గుంటూరు డివిజన్‌ల కన్నా మార్కాపురం డివిజన్ ఎక్కువగా 665.54 చ.కిమీ ఉంది. ఇందులో మార్కాపురం, గిద్దలూరు, అర్ధవీడు, ఎర్రగొండపాలెం మండలాల పరిధి ఎక్కువ. ఇందులో ఇప్పటివరకు గుర్తించిన ప్రకారం దాదాపు 149 కుటుంబ రకాలకు చెందిన వృక్షజాతి నల్లమలలో ఉంది. ఇందులో గుర్తించబడిన నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాజెక్ట్ పరిధిలో పలు రకాల జంతు పక్షిజాతులు ఉన్నాయి. 303 పక్షుల జాతులు, 55 చేపల జాతులు, 101 రకాల ఎగిరే సీతాకోక చిలుకను పోలిన జాతులు, ఇతర జాతులు ఉన్నట్లు అటవీశాఖ గుర్తించింది. ఇందులో జాతీయ వన్యప్రాణులకు సంబంధించిన కోతులు, పాంగోలిన్, సర్పాలు, ఇతర విచిత్ర జాతి జంతువుల్లో ప్రధానమైనది పెద్దపులి. అందుకే దీనిని నల్లమల రారాజు అనికూడా పిలుస్తారు.

వాతావరణ సమతుల్యం తగ్గకుండా పులుల సంతతి

వాతావరణ సమతుల్యం తగ్గిపోకుండా కాపాడుకునేందుకు పులులను కాపాడుకోవాలని పర్యావరణవేత్తలు గుర్తించారు. అందులో భాగంగా నల్లమల పరిధిలో పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలతోపాటు ప్రతిఏటా జూలై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవంగా ప్రకటించి గణనను కూడా చేపడుతుంది. నల్లమలలో 2022లో 73 పెద్దపులులు ఉండగా 2023లో 80కి పెరిగాయి. 2024లో 85కు చేరిన వీటిసంఖ్య ప్రస్తుతం 87 ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. వీటి సంరక్షణకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుంది. దాదాపు 1000 మంది సిబ్బందిని నియమించి పరిరక్షణ బాధ్యతలు అప్పగించింది. నల్లమల పరిధిలో 85 బేస్‌క్యాంపులను ఏర్పాటు చేయటంతోపాటు వాటిలో ప్రొటెక్షన్ వాచర్లుగా స్థానికంగా ఉండే చెంచు గిరిజనులనే నియమించి వారికి జీవనోపాధిగా కూడా అవకాశాలు కల్పించటం జరిగింది.

వన్యప్రాణి సంరక్షణలో సవాళ్లు

వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా పలు సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పాలి. ముఖ్యంగా అటవీ ప్రాంతలోకి మానవుల చొరబాటు వ్యవసాయ కార్యకలాపాలు పెరిగిన తరువాత జంతువుల సహజ నివాస ప్రాంతం తగ్గిపోయింది. అలాగే వన్యప్రాణులపై కొందరు అక్రమార్కుల వేట కారణంగా వీటి సంఖ్య తగ్గిపోతోంది. మరోవైపు చెట్లను అక్రమంగా నరికివేయటం, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న ఉష్ణోగ్రతల మార్పుల కారణంగా వన్యప్రాణుల ఆహార సాధన వాటి పెరుగుదలను ప్రభావితం చేస్తున్నాయి. అందుకోసమే వన్యప్రాణుల ప్రాముఖ్యతపై ప్రభుత్వం అటవీ సమీప గ్రామాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం చేపట్టింది. అలాగే వన్యప్రాణులకు అడవిలో నీటి వసతులు (సాసర్‌పిట్లు) ఏర్పాటు చేయటం, వాటి సంరక్షణలో భాగంగా కెమెరాలు ఏర్పాటు చేయటంతో పాటు ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

మొత్తానికి మానవ మనుగడకు ప్రకృతి సమతుల్యత కాపాడేందుకు వన్యప్రాణులు ఎంతో అవసరం అనేది ప్రతి ఒక్కరూ గుర్తించాలి. వాటి సంరక్షణలో మనవంతుగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి వాటికి నివాసాలు ఏర్పాటు చేయాలి. ఆవాసాల్లోకి వచ్చినప్పుడు ఎటువంటి హాని తలపెట్టకుండా తిరిగి అడవుల్లో వదిలివేయటం చేయాలి. మన భవిష్యత్తు ప్రకృతికి మనం ఇచ్చే గౌరవం మీదే ఆధారపడి ఉంటుందని గుర్తుంచుకోవాలి.

కేంద్ర పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

- దిశ కమిటీ ఛైర్మన్ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని దిశా కమిటీ ఛైర్మన్, ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌హాలులో శుక్రవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ నిధుల్లో జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిమూడు నెలలకు ఒకసారి సమీక్షించడం జరుగుతుందన్నారు. ప్రతి ప్రభుత్వశాఖలో కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా చేపడుతున్న 42 రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు,వాటికి చేసిన ఖర్చు వివరాలను సమీక్షిస్తామన్నారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ దిశా సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ పొజిషన్ సర్టిఫికెట్లు రాకపోవడంతో అనేక మంది పేద వర్గాల ప్రజలు గృహనిర్మాణ పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారన్నారు. వారికి వెంటనే పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి కందుల నారాయణరెడ్డి పలు సమస్యలను లేవనెత్తారు.

- పట్టణ వ్యవహారాల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా మాగుంట మరో ఏడాది పొడగింపు

ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా మరో ఏడాది పొడిగిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉత్తర్వులు జారీచేశారు. మాగుంట పదవీ కాలం 2025-26 వరకు పొడిగించారు.

జిల్లాకు స్వచ్ఛాంధ్ర అవార్డులు

- ప్రకటించిన కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాకు లభించిన స్వచ్ఛాంధ్ర అవార్డులను కలెక్టర్ పీ.రాజాబాబు ప్రకటించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాకు మూడు రాష్ట్రస్థాయి అవార్డులు, 49 జిల్లాస్థాయి అవార్డులు వచ్చాయన్నారు. స్వచ్ఛనగర, మండలాలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ ఆస్పత్రులు, స్వచ్ఛ కార్యాలయాలు, స్వచ్ఛ రైతుబజార్లు.. 17 విభాగాల్లో అవార్డులకు ఎంపిక చేశారని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛఆంధ్ర (ప్రోత్సాహక అవార్డులు-25కు, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల కింద స్వచ్ఛతా కార్యకలాపాలపై చేసిన కృషిని గుర్తించేందుకు ప్రభుత్వం ఈ అవార్డులను ప్రకటించిందని వివరించారు. మొత్తం 17 కేటగిరీల్లో ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 6వ తేదీన విజయవాడలో రాష్ట్రస్థాయి అవార్డుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.

జిల్లాకు వచ్చిన రాష్ట్రస్థాయి అవార్డులు

స్వచ్ఛ గ్రామ పంచాయతీల్లో చీమకుర్తి మండలం ఆర్ఎల్‌పురానికి, ఉత్తమ స్వచ్ఛ స్లామ్ లెవల్ ఫెడరేషన్‌లలో కనిగిరి మండలం వీరబ్రహ్మేంద్ర మహిళా సమాఖ్యకు, స్వచ్ఛ హాస్పటల్ విభాగంలో సీహెచ్‌సీ చీమకుర్తికి రాష్ట్రస్థాయి అవార్డులు వచ్చాయి.

జిల్లాస్థాయి అవార్డులు

స్వచ్ఛ మునిసిపాలిటీ విభాగంలో కనిగిరి నగర పంచాయతీ, ఉత్తమ స్వచ్ఛ గ్రామ పంచాయతీలు కంభంపాడు (సీఎస్‌పురం), బింగినపల్లి (సింగరాయకొండ), కనుమళ్ల (సింగరాయకొండ), వడంపల్లి (వైపాలెం) ఎంపికయ్యాయి. ఉత్తమ స్వచ్ఛ గ్రామ సంఘాలు గలిజరుగుళ్ల (బబిపేట), అల్లూరు (కొత్తపట్నం), పెదయాచవరం (మార్కాపురం), సర్వేరెడ్డిపాలెం (ఒంగోలు), మూగచింతల (పొదిలి) ఎంపికయ్యాయి. ఉత్తమ రైతు బజారుగా ఒంగోలు కొత్తపట్నం బస్టాండు రైతు బజారుకు అవార్డు లభించింది. ఉత్తమ స్వచ్ఛ స్లామ్ లెవెల్ ఫెడరేషన్ విభాగంలో విశ్వభారతి స్లమ్ సమాఖ్య (ఒంగోలు), ఆక్షిత మహిళా సమాఖ్య (కనిగిరి), ఉత్తమ బస్‌స్టేషన్‌గా ఒంగోలు ఆర్టీసీ బస్టాండు, ఉత్తమ స్వచ్ఛ ఎన్జీవో విభాగంలో సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (టంగుటూరు), ఐటీసీ మిషన్ సునెహరా (ఒంగోలు అర్బన్), ఉత్తమ స్వచ్ఛ ఆస్పత్రులుగా ఒంగోలు మండలం వెంగముక్కలపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, వైపాలెం ఏరియా హాస్పిటల్, స్వచ్ఛ పాఠశాలల విభాగంలో ఏపీ మోడల్ స్కూలు (కనిగిరి), కేజీబీవీ స్కూలు (మార్కాపురం), ప్రభుత్వ హైస్కూలు (కొమరోలు), మునిసిపల్ ఎస్సీ, బీసీ హైస్కూలు (మార్కాపురం), జడ్పీ హైస్కూలు (చందలూరు) స్వచ్ఛత అంగన్‌వాడీల విభాగంలో అన్నంగి అంగన్‌వాడీ కేంద్రం (మద్దిపాడు), లింగంగుంట అంగన్‌వాడీ కేంద్రం (మద్దిపాడు), 13వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం (మార్కాపురం), 2వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం (కనిగిరి), తువ్వపాడు అంగన్‌వాడీ కేంద్రం (కేకేమిట్ల)లకు అవార్డులు లభించాయి. ఉత్తమ స్వచ్ఛత ప్రభుత్వ కార్యాలయాలు ఒంగోలులోని డ్వామా కార్యాలయం, పొదిలి తహసీల్దార్ కార్యాలయం, చీమకుర్తి ఎంపీడీవో కార్యాలయం, ఉత్తమ పరిశ్రమల విభాగంలో భగీరథ కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఉత్తమ స్వచ్ఛత పరిశ్రమలు దేవీ సీ ఫుడ్స్ లిమిటెడ్, జేసీ బయోటెక్ ప్రైవేలు లిమిటెడ్, ఉత్తమ స్వచ్ఛ వసతిగృహాలు సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం (ఒంగోలు), ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహం (సింగరాయకొండ), ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ హైస్కూలు (మురికిమల్ల), ఉత్తమ స్వచ్ఛ రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహం (సింగరాయకొండ), ఉత్తమ స్వచ్ఛత వారియర్స్ (పారిశుధ్యకార్మికులు) ఎం.వెంకట్ (ఒంగోలు నగర పాలక సంస్థ), టి. హరిబాబు (మార్కాపురం మునిసిపాలిటీ), కే బాలయ్య (గిద్దలూరు), కే సుబ్బరత్నం (చీమకుర్తి), జి. నాగేశ్వరరావు (పొదిలి), ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్స్ విభాగంలో మల్లెల పోలు (చిన ఆలవలపాడు), మట్టేమల్ల నాగరాజు (బీపేట), కడియం రామాంజమ్మ (ఆర్ఎల్‌పురం), పల్లె ఏసోబు (వెస్ట్ నాయుడుపాలెం), ఎం.తిరుపతి(కేపల్లెపాలెం)లకు అవార్డులు లభించాయి. విలేకరుల సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు



గ్రామ చావిడి నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి స్వామి, 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ దినకర్, ఎంపీ మాంగుంట, ఎమ్మెల్యేలు జనార్దన్, బీఎన్, కలెక్టర్ రాజాబాబు

గాంధీ స్ఫూర్తితో అభివృద్ధికి చర్యలు

- మంత్రి స్వామి
- గ్రామ చావిడి పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహాత్మ గాంధీజీ స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. జాతిపిత గాంధీజి 156వ జయంతిని పురస్కరించుకుని గురువారం ఒంగోలులోని గాంధీ రోడ్‌లో గల గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విగ్రహం వద్ద దశాబ్దాల కాలంగా ఉన్నటువంటి వీఆర్వో భవన్ (గ్రామ చావిడి) పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గంలోనే గ్రామ స్వరాజ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రూ.40లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించే వీర్వో భవన్‌లో రీడింగ్ రూమ్, ఫొటో ఎగ్జిబిషన్, చంటి బిడ్డలకు పాలిచ్చే సదుపాయాలతోపాటు మరుగుదొడ్లు నిర్మించడం కోసం ప్రణాళిక రూపొందించామన్నారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో దేశ ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపేలా అహింస, సత్య మార్గాలను ఎంచుకుని తన వ్యక్తిత్వాన్ని ఇతరులకు ఆదర్శంగా నిలిపిన మహోన్నతులు గాంధీజీ అన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ పరిసరాల స్వచ్ఛత గాంధీజీ ఆశయమని, అదే ఆశయ స్ఫూర్తితో దేశ, రాష్ట్రాల అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంకిత భావంతో పనిచేస్తున్నారని అన్నారు.

20 సూత్రాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్‌మాట్లాడారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఉత్తమ పనితీరు కనబరిచిన పది మంది పారిశుధ్య కార్మికులను మంత్రి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కళావతి, నగర కమిషనర్ కే.వెంకటేశ్వరరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ భాస్కర్‌బాబు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, జనసేన నాయకులు కంది రవిశంకర్ పాల్గొన్నారు.


మంత్రి స్వామిని సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్త యానాదిరావు


చీమకుర్తిలో అమ్మవారి విగ్రహ ఊరేగింపులో భక్తులు


ఒంగోలులో పార్వేటను పురస్కరించుకుని స్వామివార్ల నగరోత్సవం

అంబరాన్నంటిన దసరా సంబరాలు

- వైభవంగా విజయదశమి
- ముగిసిన దేవీశరన్నవరాత్రులు
- ఒంగోలులో వేడుకగా పార్వేట
- సింగరాయకొండలో మంత్రి స్వామి, వల్లూరులో ఎమ్మెల్యే దామచర్ల విశేష పూజలు


గొడుగుపాలెంలో దుర్గామాత విగ్రహం వద్ద భారీగా భక్తులు


గాంధీరోడ్డులో జమ్మిచెట్టుకు భక్తుల పూజలు


పిల్లల ఆటవస్తువులను కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు


సెల్ఫీ తీసుకుంటున్న యువతులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయదశమి వేడుకలను వైభవంగా జరిగాయి. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాలలో అమ్మవారికి విశేష పూజలందించడంతోపాటు, ఒంగోలులో కళారాల ఉత్సవాలను కనులపండుగలా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ముగిశాయి. దీంతో ఊరూవాడ ప్రజలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నగరంలోని కొండమీద శివాలయం, బాలాజీరావుపేట, బీవీఎస్ హాలు, కొత్తపట్నం బస్టాండ్, గంటాపాలెంలోని పార్వతి అమ్మవారు, దేవుడు చెరువు రోడ్‌లోని వేపచెట్టు అమ్మవారు పలు ప్రాంతాల్లో విజయదశమి వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా దుర్గాదేవి ఆలయాల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. అలాగే గురువారం రాత్రి పార్వేట ఉత్సవం నగరంలో వైభవంగా జరిగింది. తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో వీధులు కిక్కిరిసిపోయాయి. మస్తాన్‌దర్గా సెంటరులో కళారాల సంబరాలు ఘనంగా జరగ్గా ఆప్రాంతం భక్తులతో నిండిపోయింది.

చీమకుర్తిలో..

చీమకుర్తి: దసరా సంబరాలు చీమకుర్తిలో అంబరాన్నంటాయి. పట్టణంలో హరిహరక్షేత్రం, ఇసుకవాగు సెంటర్‌లో ఉన్న సాక్షిరామలింగేశ్వరాలయం, వీరభద్రస్వామి ఆలయం, నెహ్రూనగర్ రామాలయంతో పాటు మండలపరిధిలోని గ్రామాల్లో విజయదశమి వేడుకలను అత్యంత వైభవంగా ప్రజలు జరుపుకున్నారు. హరిహరక్షేత్రంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు జరిపారు. నెహ్రూనగర్ రామాలయంలో ఏర్పాటుచేసి పదిరోజులపాటు విశేషపూజలందుకున్న అమ్మవారి ప్రతిమను గురువారం పట్టణంలో ఊరేగించి నిమజ్జనానికి తరలించారు.


మస్తాన్‌దర్గా సెంటరులో జరిగిన కళారాల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

మంత్రి స్వామి పూజలు

సింగరాయకొండ: సింగరాయకొండ పంచాయతీ పరిధి రైల్వేస్టేషన్ రోడ్డులోని చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రులు వైభవంగా ముగిశాయి. గురువారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గీతామందిరంలో రాధాకృష్ణులను మంత్రి దర్శించుకున్నారు. ఆతర్వాత కందుకూరు రోడ్డు సెంటర్‌లోని జాలమ్మతల్లి దేవస్థానానికి చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, కొత్తూరి రంగనాయకులు, గాలి హరిబాబు జాలమ్మతల్లి దేవస్థానం ఆలయ ధర్మకర్త యానాదిరావు పాల్గొన్నారు.

వల్లూరమ్మ ఆలయంలో..

టంగుటూరు(కొండపి): విజయదశమి సందర్భంగా వల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ జిల్లా సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బి.రమేష్ వారికి అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించారు.

మద్యం తాగి రోడ్లపై గొడవలు చేస్తే కేసులు

- తాలుకా సీఐ విజయకృష్ణ

ఒంగోలు క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి రోడ్ల పైకి వచ్చి గొడవలు సృష్టిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ శుక్రవారం హెచ్చరించారు. ఇటీవల కొంతమంది అర్ధరాత్రులు పూటుగా తాగి మద్యం మత్తులో రోడ్ల మీద అనవసరమైన గొడవలు చేస్తున్నారని చెప్పారు. ఇకమీదట ఇలాంటి గొడవలు పడితే ఎవరైనా వదిలేది లేదని స్పష్టం చేశారు. కేసులలో ఇరుక్కొని అనవసరంగా యువకులు తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆయన హితవు పలికారు.

ఆపుస్మా జోనల్ కార్యాలయం ప్రారంభం

ఒంగోలు విద్య, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అండ్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపుస్మా) జోనల్ కార్యాలయాన్ని గురువారం ఒంగోలు నగరం రామనగర్ మొదటిలైనులో ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, కృష్ణా జిల్లాల జోనల్ సమావేశంలో జిల్లా యూనిట్ సమావేశాలకు ఈ కార్యాలయం వేదిక కానుంది. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు ఏవీ.సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు కొల్లా మాధవరావు, గౌరవాధ్యక్షుడు జి.హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు వంశీకృష్ణ, మల్లికార్జునరావు, సురేష్, శ్రీనివాసచౌదరి పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తనిఖీలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వి.హర్షవర్ధనరాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది విధుల గురించి తెలుసుకున్నారు. ఫైల్స్ పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్‌రావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ) కాలికట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ విభాగాలలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఒంగోలులోని పన్నెండు స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు పాల్గొనగా, హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ జగదీష్ శుక్రవారం తెలిపారు. ఈనెల 12న కాలికట్‌లో జరిగే జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌కు తమ పాఠశాల విద్యార్థులు భాను, అర్ణవ్, చరణ్‌తేజ్ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత దుస్తుల విక్రయ స్టాల్ పరిశీలన


వస్త్రాలను పరిశీలిస్తున్న చైర్మన్ దినకర్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : చేనేత, జౌళి శాఖ ఒంగోలు, ఆప్కో ఆధ్వర్యంలో స్థానిక బాపూజీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన చేనేత దుస్తుల విక్రయ స్టాల్‌ను 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలపై తగ్గిన జీఎస్టీ ధరల ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించి చేనేత వస్త్రాలను కొనుగోలు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు రఘునంద పాల్గొన్నారు.

6న ఒంగోలులోనే ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- డీఆర్వో చిన ఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈనెల 6వతేదీన ఒంగోలులోనే జరుగుతుందని డీఆర్వో చిన ఓబులేషు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వతేదీన మార్కాపురంలో ప్రజావేదిక జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు ఒంగోలులో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉన్నందున ప్రజావేదికను కూడా ఒంగోలులోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈవిషయాన్ని అర్జీదారులు గమనించాలని ఆయన కోరారు.

పార్శిల్ కార్యాలయాల్లో తనిఖీలు


బస్టాండ్‌లో పార్శిళ్లను తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

ఒంగోలు క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పార్శిల్ కార్యాలయాల్లో పోలీసులు శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లలో ఉన్న పార్శిల్ కార్యాలయాల్లో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. పార్శిళ్ల ద్వారా డ్రగ్స్ గంజాయిలాంటి మాదక ద్రవ్యాలు అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయడానికి ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు తనిఖీలు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగరాజు వెల్లడించారు.

గ్రానైట్ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్టవేయాలి


ఎంపీ మాగుంటకు వినతిపత్రం ఇస్తున్న జడ్పీటీసీ శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలో గ్రానైట్ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలంటూ చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన దిశా కమిటీ చైర్మన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రం అందజేశారు. అక్రమ తవ్వకాల కారణంగా సుమారు 18 గ్రామాలకు తాగునీరు, సుమారు 20వేల ఎకరాలకు సాగునీరు అందించే కారుమంచి కాలువ క్వారీలో పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గ్రానైట్ క్వారీ పరిధిని మించి ఇరిగేషన్ పరిధిలో ఉన్న భూమిలో కూడా అక్రమ తవ్వకాల వద్ద చీమకుర్తి దక్షిణ వైపు గ్రామాలు, రైతులు, కూలీలు సాగు, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డీఎంఎఫ్ గ్రాంట్ నుంచి రూ.2.62 కోట్లు మంజూరైనా టెండర్లు పిలవకుండా ఉండటంతో అంతర్యం ఏమిటన్నారు. అందువల్ల వెంటనే కారుమంచి కాలువ నిర్మాణం చేపట్టి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.

ఎస్సీడీసీ రుణాలపై విచారణ చేయాలి


డీఏహెచ్‌వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల పెంపకం దారుల జిల్లా సహకార యూనియన్ ద్వారా ఇచ్చిన ఎస్సీడీసీ రుణాల పంపిణీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం ఒంగోలులో పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావును కలిసి మేరకు వినతిపత్రం అందజేశారు. జిల్లా యూనియన్ ద్వారా 2014నుంచి 2021 వరకు గొర్రెల పెంపకందారుల అభివృద్ధి కోసం మూడు దఫాలుగా రూ.20 కోట్లను 1000మందికి ఇచ్చారన్నారు. అప్పటి పాలకవర్గం, అధికారులు నిబంధనలకు విరుద్ధంగా రుణాలు పంపిణీ చేశారని, అందువల్ల సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు, బుర్రి ఆంజనేయులు, చిట్టిబోయిన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

- రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ గవర్నర్ రామ్‌ప్రసాద్


మొక్కలను నాటుతున్న క్లబ్ సభ్యులు

ఒంగోలు(రూరల్), అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాని కాపాడుకునేందుకు పాటు పడాలని రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ.రామ్‌ప్రసాద్ కోరారు. శుక్రవారం ఒంగోలు మండలం దశరాజుపల్లి-ఒంగోలు రోడ్డులో రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంగా కొనసాగాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని కాపాడుకోవాలని చెప్పారు. ఫ్రీడమ్ బర్త్ హెల్త్ క్లబ్ వారు ప్రజలకు కూరకాగాల విత్తనాలు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీకి వీల్‌చైర్‌ను రోటరీ క్లబ్ వారు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాలంపాటి యానాదినాయుడు, మాలంపాటి కృష్ణారావు, గనిపినేని సుబ్రహ్మణ్యం, పులిచర్ల మోహన్‌రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రావిపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కొల్లూరి శ్రీనివాసరావు, ట్రెజరర్ ఆర్ల శ్రీరామమూర్తి, క్లబ్ జిల్లా చైర్మన్ బండారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్విస్ కళాశాలలో అంతరిక్ష వారోత్సవాలు

- 7నుంచి విద్యార్థులకు పలు పోటీలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు, నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సతీశ్ ధావన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అంతరిక్ష వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. భూమిపైన జరిగే అతిపెద్ద అంతరిక్ష వేడుక వరల్డ్ స్పేస్ వీక్ ఈ నేపథ్యంలో ప్రతి ఏటా అక్టోబరు 4నుంచి 10 వతేదీ వరకు స్పేస్‌వీక్ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఒంగోలులో క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ శ్రీగాయత్రి తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించి పోస్టర్‌ను శుక్రవారం స్థానిక కళాశాలలో ఆవిష్కరించారు. 7వతేదీన వాక్‌తో వేడుకలు ప్రారంభమవుతాయని, 8న 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు అంతరిక్షం అంశంపై డ్రాయింగ్ పోటీలు, 9వ తేదీన 6నుంచి 12 తరగతుల విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు జరుగుతాయన్నారు. 8,9 తేదీల్లో కళాశాల విద్యార్థులకు టెక్నికల్ ఎక్స్‌పో నిర్వహించడంతో పాటు విద్యార్థులకు అంతరిక్షం, అక్కడి పరిస్థితులు, శాటిలైట్లు, ఇస్రోలాంచ్ వెహికల్స్ తదితర అంశాలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్, క్విస్ కళాశాల డీపీఎస్ఆర్ డైరెక్టర్ బీవీ.సుబ్బారావు, వరల్డ్ స్పేస్‌వీక్-25 ఒంగోలు సబ్‌కమిటి చైర్మన్ లీలా నాగశ్రీనివాసరావు, మెంబర్ సెక్రటరీ ఆదిత్య, ఇస్రో అధికారులు రామాంజనేయులు, అప్పారావు, శివనాగిరెడ్డి, క్విస్ కళాశాల డీన్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మాగాంధీ జయంతి

- పలువురి నివాళులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కఠారి శంకర్, బొట్లా రామారావు, వై.వెంకటేశ్వరరావు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, భూమిరెడ్డి రవణమ్మ, బొట్లా సుబ్బారావు, నగరకంటి శ్రీనివాసరావు, పి.రాజీవ్, రొండా అంజిరెడ్డి, సయ్యద్‌అప్సర్, మీరావలి, వీసం బాలకృష్ణ, పిగిలి శ్రీనివాసరావు, గౌతం అశోక్, జిలానీబాషా పాల్గొన్నారు.

- ఆంధ్రకేసరి యూనివర్శిటీలో గురువారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.నిర్మలామణి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు శ్రీనివాస్, సురేష్‌కుమార్, ప్రసన్నకుమారి, ఏడుకొండలు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలం కరవది గ్రామ పంచాయతీలో గురువారం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని డీపీవో వెంకటేశ్వరరావు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖరరావు, ఏఈ రామ్‌ప్రసాద్, పోలవరపు వెంకట్రామయ్య, సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.


చీమకుర్తిలో రక్తదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

చీమకుర్తి: గాంధీ జయంతి వేడుకలను లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి, ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలుసేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్,చలువాది బదరి నారాయణ, చలువాది రమేష్,మారం వెంకారెడ్డి, అంజిరెడ్డి, మన్నం వెంకయ్య, కొత్రపు రాఘవరావు, కందిమళ్ల గంగాధరరావు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: మహాత్మా గాంధీ జయంతిని కొండపిలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కామేపల్లి రోడ్డులోని గాంధీ విగ్రహానికి ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము సుశీల, పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్‌రావు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పాదర్తి సుధాకర్, పద్మనాభుని సుబ్బారావు, అద్దేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మాంసం అమ్మకాలు


ఒంగోలులో తెరచివున్న మాసం దుకాణం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జయంతి రోజున మాంసం అమ్మకాలను ప్రభుత్వం నిషేధించినా జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటు జిల్లావ్యాప్తంగా భారీగా జరిగాయి. గాంధీజయంతి రోజునే దసరా పండుగ కావడంతో ప్రజానీకం ఉదయం ఐదు గంటలనుంచే చికెన్, మటన్ దుకాణాల వద్ద కొనుగోళ్ళు చేపట్టారు. మరోవైపు ఒంగోలు నగరంలో గల కొత్తమార్కెట్‌లోని చేపల మర్కెట్‌లో కూడా అమ్మకాలు యథేచ్ఛగా జరిగాయి. అలాగే పాత మార్కెట్ సెంటర్, మంగమూరు రోడ్డు, కొత్తపట్నం బస్టాండు, కర్నూలు రోడ్డు, నెల్లూరు బస్టాండు తదితర ప్రాంతాల్లో మాంసం అమ్మకాలు జరుగుతున్నా ఆ వైపు అధికారులు కన్నెత్తి చూసిన పరిస్థితి లేకుండా పోయింది. దీంతో బహిరంగంగా మాసం అమ్మకాలు చేశారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఊరట



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

మద్దిపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు, రైతులకు ఎంతో ఊరట లభించిందని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు అవగాహనర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. వ్యవసాయాధికారి వెంకటేష్ మాట్లాడుతూ సామాన్య ప్రజలతోపాటు రైతులకు జీఎస్టీ సంస్కరణలు ఎంతోమేలు చేస్తాయని పేర్కొన్నారు. యాంత్రీకరణ పరికరాల ధరలు తగ్గడం వలన కూలీల కొరతను అధిగమించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జనార్దన్, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి, రేగుల వీరనారాయణ, చేరెడ్డి నర్సారెడ్డి, గొంటు హనుమారెడ్డి, సారెడ్డి పుల్లారెడ్డి, కదిరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు యామారపు వెంకటరావు, తండ్రి వెంకయ్య, లింగంగుంట గ్రామం, అనువారు తేదీ.15-07-2025, డి.నెం. 7746/25 ప్రకారం యామారపు నాగమ్మ గారి ద్వారా సెటిల్‌మెంటు పత్రం ద్వారా క్రింద తెలుపబడిన షెడ్యూలు దాఖలా ఆస్తిని పొందియున్నారు. యామారపు నాగమ్మ గారి భర్త గారైన యామారపు వెంకయ్య గారి ద్వారా డి.నెం.3094/81 ప్రకారం షెడ్యూలు దాఖలా ఆస్తి వచ్చియున్నది. సదరు డాక్యుమెంటు నెం.3094/81 జిరాక్స్ తీయించుటకు ఒంగోలు ముంగమూరు రోడ్డుకి వెళ్ళుచుండగా పొరపాటున ఎక్కడో జారిపడిపోయినది. అందుకు గాను ఒంగోలు తాలుకా పోలీసు వారికి కంప్లయింటు ఇచ్చియున్నాను. సదరు డి.నెం.3094/81 ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియచేయవలసినదిగా కోరడమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్ రిజిస్ట్రేషను, వెంగముక్కపాలెం గ్రామ పంచాయితి, మామిడిపాలెం గ్రామం, సర్వేనెం.2/2ఎ, ప్లాటు నెం.18, విస్తీర్ణం 41 గదులు -328 చ.గజములు. తూర్పు: ప్లాటు నెం.17- దిశ 72 అడుగులు, దక్షిణం: 20 అడుగుల రోడ్డు - దిశ 41 అడుగులు, పడమర: 25 అడుగులు వెడల్పు గల రోడ్డు- దిశ 72 అడుగులు, ఉత్తరం: ప్లాటు నెం.13 - దిశ 41 అడుగులు.

తేది: 03-10-2025
స్థలం : ఒంగోలు

ఇట్లు: శ్రీమతి చియ్యపు శారద
K.N. కృష్ణవేణి, అడ్వకేట్లు,
ఒంగోలు,సెల్: 92475 23710

అవీ..ఇవీ



కేకును కత్తిరిస్తున్న తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఉద్యోగోన్నతుల జీవోపై హర్షం

- తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అభినందనలు

పెద్దదోర్నాల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1,209 మంది డీఈవో పూల్ లాంగ్వేజి పండిట్లను స్కూల్ అసిస్టెంటు లాంగ్వేజె ఎస్‌గా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ జారీ చేసిన సీఎస్సీ మెమో నెంబర్14 పట్ల తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. టీఎన్‌యూఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెహమాన్, మండ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేకును కత్తిరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఆరేళ్లుగా భాషా పండితుల ఇబ్బందులను గుర్తించిన విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించి విజయదశమి కానుకగా జీవోను ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు తోడ్పడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు బాలగురువులు, సహా కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి రెహ్మాతుల్లా తదితరులు పాల్గొన్నారు.



ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

దోమల నివారణకు ఫాగింగ్

గిద్దలూరు టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వినూత్న ప్రయత్నాలలో భాగంగా ట్రాక్టర్‌కు అమర్చిన స్ప్రే మిషన్ ద్వారా దోమలను నివారించేందుకు ఫాగింగ్‌ను పురపాలక సంఘం ప్రారంభించింది. మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు గురువారం సాయంత్రం ఫాగింగ్‌ను ప్రారంభించారు. ఇప్పటివరకు ధైవాన్ స్ప్రేయర్ ద్వారా దోమల నివారణ మందు స్ప్రే చేసినప్పటికీ తక్కువ ప్రాంతం, ఎక్కువ సమయం పట్టడం వలన ట్రాక్టర్ ద్వారా స్ప్రే మొదలు పెడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గణేష్‌నగర్, మాయాబజారు, చిన్నమార్కెట్‌ల వద్ద ట్రాక్టర్‌కు అమర్చిన స్ప్రే మిషన్ ద్వారా యాంటీలార్వా కెమికల్‌ను స్ప్రే చేశారు.



వెండి త్రిశూలం, వెండి చెరకు గడలను దేవస్థాన కమిటీకి అందజేస్తున్న దాతలు

వెండి త్రిశూలం, చెరకు గడల అందజేత

గిద్దలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పలువురు దాతలు శరన్నవరాత్రుల సందర్భంగా వెండి వస్తువులను బహూకరించారు. సుమారు 3 లక్షల విలువైన వెండి త్రిశూలం, వెండి చెరకు గడలను మునగనూరి రాఘవేంద్ర దంపతులు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కమిటీ ప్రతినిధులకు అందజేశారు. రూ. 50వేల విలువైన నక్షత్ర హారతిని శివపురం వెంకటరామయ్య అనే దాత, రూ. 30వేల విలువైన వెండి గిన్నెను రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు, రూ. 30వేల విలువైన వెండి పాత్రలను శేగు రవి కుమార్ అనే దాతలు అమ్మవారికి బహూకరించారు. ఒక మహిళ బంగారు ముక్కుపుడకను, దర్శి రవికుమార్ వెండి పాత్రను అందజేయగా 17 మంది దాతలు వెండి గ్లాసులను, గంగాళాలను అమ్మవారికి శరన్నవరాత్రుల సందర్భంగా అందజేశారు.



బురదతో నిండి అధ్వానంగా మారిన రహదారి

అడుగేస్తే అంతే !

బురదమయంగా గోకుల్‌నగర్ వీధులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండేపల్లి రోడ్డులో ఉన్న గోకుల్ నగర్‌లో రహదారులు బురదమయంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు నిలవటంతో ఆ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అడుగు వేయటానికి కూడా వీలు లేని రోడ్లపై నడవాలంటే ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ఎంపీపీ లక్ష్మీదేవి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

మార్కాపురం రూరల్, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పనిచేసే అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ బండి లక్ష్మీదేవి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో బాల చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరై ఆయా శాఖల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించారు. ఎంపీడీవో ఎ. బాల చెన్నయ్య మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే ముందు ఆ శాఖ ద్వారా ప్రస్తుతం ప్రజలకు అందిస్తున్న సేవలను, పథకాలను, రాయితీలను, పనుల వివరాలతో సభకు రావాలని తెలిపారు. సభలో ప్రజా ప్రతినిధులు తెలియజేసిన సమస్యలను నోట్ చేసుకుని మళ్లీ జరిగే సర్వసభ్య సమావేశంలో ఆ సమస్యల పరిష్కార పురోగతిని తెలియజేయాలని తెలిపారు. మార్కాపురం పీఏసీఎస్ చైర్మన్ జవ్వాజి రామాంజులరెడ్డి, మిట్టమీదిపల్లి చైర్మన్ గొలమారి నాసర్‌రెడ్డిలు సభలో మండల స్థాయి అధికారులకు పలు ప్రజా సమస్యలను తెలియజేసి వివరణ కోరారు. గతంలో మార్కాపురం ఎంపీడీవోగా పనిచేసి ఇటీవల బదిలీపై నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న బి. శ్రీనివాసులును మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సలహాకమిటీ సభ్యులు కాకర్ల శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి వై భాగ్యవతి, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, ఎంఈవో రాందాస్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, విద్యుత్ ఏఈ నాగేంద్రరెడ్డి, ఏవో బుజ్జిబాయి, పీఆర్ ఏఈ మోహన్‌రాజ్, పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం

పలు చోట్ల అవగాహన ర్యాలీలు

గిద్దలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయాధికారి వై. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జీఎస్టీని తగ్గించడం వలన వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు, టైర్లు, బిందుసేద్యం సామగ్రి, డ్రోన్ల రేట్లు 7 నుంచి 13శాతానికి తగ్గాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి రైతులకు, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

పొదిలిలో



కొనకనమిట్లలో మానవహారం నిర్వహిస్తున్న ఉద్యోగులు

పొదిలి : జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు, రైతులకు ఎంతో ఊరటనిస్తుందని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జీఎస్టీ సంస్కరణలతో అన్నదాతలకు, రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ప్రజలకు జీఎస్టీ తగ్గుదలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయాధికారి డి శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడారు.

తర్లుపాడులో..

తర్లుపాడు : స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్‌పై రైతులకు వ్యవసాయాధికారిణి జోత్స్నదేవి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొనకనమిట్లలో మానవహారం

కొనకనమిట్ల: జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు, రైతులకు ఎంతో ఊరటనిస్తుందని ఏవో ప్రకాష్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల కేంద్రం కొనకనమిట్లలో జీఎస్టీ సంస్కరణలతో అన్నదాతలకు, రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో మానవహారం నిర్వహించారు.

ఎర్రగొండపాలెంలో..

ఎర్రగొండపాలెం: జీఎస్టీపై శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎర్రగొండపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు మాట్లాడారు.



గిద్దలూరులో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పెద్దదోర్నాలలో ర్యాలీ

పెద్ద దోర్నాల : సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో నాసర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ మండల తహసీల్దారు కార్యాలయం నుంచి నటరాజ్ కూడలి మీదుగా ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుంది..ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జవహర్‌లాల్ మాట్లాడారు. టీడీపీ నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, షేక్ మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దారవీడులో..

పెద్దారవీడు : కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీ నారాయణ అన్నారు. మండలంలోని బోయలదుంపల, కక్రోలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవుడి పార్వేట మహోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామికి పార్వేట మహోత్సవం భక్తజనరంజకంగా నిర్వహించారు. అర్చకులు అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. మోతకాపులు చెన్నకేశవ నామస్మరణతో చెన్నకేశవుడు ఆలయం నుంచి చెరువు సమీపంలోని దసరా మండపం వద్దకు చేరుకుని మండపంలో వేంచేపు చేశారు. శమీ వృక్ష పూజ అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.



తర్లుపాడులో వేణుగోపాలస్వామికి పూజలు నిర్వహిస్తున్న న్యాయాధికారి దేవేంద్రరెడ్డి

వేణుగోపాలస్వామి పార్వేట ఉత్సవం

తర్లుపాడ : దసరా నవరాత్రుల సందర్భంగా తర్లుపాడులోని శ్రీ రుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి పార్వేట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా వేణుగోపాలస్వామి మూలవిరాట్‌కు ఆలయ ప్రధాన అర్చకులు రమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంపైకి తీసుకొచ్చి పూజలు చేశారు. అనంతరం తర్లుపాడువీధుల్లో స్వామివారిని అంగరంగ వైభవంగా మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారికి మార్కాపురం సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.వేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.



త్రిపురాంతకంలో రాజరాజేశ్వరీదేవిగా బాలాత్రిపురసుందరీ దేవి అమ్మవారు

వైభవంగా గ్రామోత్సవం

గిద్దలూరు : విజయదశమి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు బంగారుచీరలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా దేవాలయానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలతో సెమిదర్శన కార్యక్రమం ప్రధాన వీధుల గుండా సాగింది. శ్రీకుసుమ హరనాథ మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యప్రదర్శన అందరినీ అలరించింది. షరాఫ్ బజారులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, అలాగే షిర్డీసాయిబాబా దేవస్థానాల నుంచి కూడా ఉత్సవ విగ్రహాలతో శమీ దర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది.

వైభవంగా ముగింపు వేడుకలు

పెద్ద దోర్నాల :దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ముగింపు వేడుకలు శుక్రవారం వైభోపేతంగా నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయం, శ్రీ పోలేరమ్మ దేవాలయం, శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం, తిమ్మాపురంలోని శ్రీ చౌడేశ్వరీ దేవి ఆలయంలో గురువారం అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథాలపై అమ్మవార్లను ప్రతిష్ఠించి గ్రామోత్సవాలు నిర్వహించారు.

అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు

ఎర్రగొండపాలెం రూరల్ : స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 11 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు గురువారం అమ్మవారికి సుమారు రూ.30లక్షల నగదుతో అలంకరణ చేశారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు.

పాలకొండపై . ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం

ఎర్రగొండపాలెం లోని మాచర్ల - మార్కాపురం జాతీయ రహదారి వెంట ఉన్న పాలకొండపై వెలసిన శ్రీ జగన్మాత ఈశ్వరీ దేవి ఆలయం వద్ద శుక్రవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

త్రిపురాంతకంలో..

త్రిపురాంతకం : దసరా శరన్నవరాత్రులు ఘనంగా ముగిశాయి. త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం బాలత్రిపురసుందరీదేవి అమ్మవారు గురువారం రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో మహిళల కోలాటం ఆకట్టుకుంది. ఎస్సై శివబసవరాజు సిబ్బందితో కలసి భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.



మార్కాపురంలో పార్వేటలో చెన్నకేశవుడు



గిద్దలూరులో బంగారు చీరలో దర్శనమిచ్చిన అమ్మవారు

ఘనంగా విజయదశమి వేడుకలు

కంభం : విజయదశమి పండుగ సందర్భంగా కంభం, అర్ధవీడు మండలాలలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం , శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం , శ్రీ కోటా సత్యమాంబ దేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు భక్తులు కుంకుమ బండ్లను కట్టి బోనాలు, పొంగళ్లు నైవేద్యాలుగా సమర్పించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువలా జరిగింది.

అధికధర పలికిన అమ్మవారి కలశం

పొదిలి : స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి కలిశపాట ఎన్నడూ లేని విధంగా అత్యధిక ధర పలికిందని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. దసరా శరనవరాత్రులలో భాగంగా అమ్మవారు శుక్రవారం రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అందులో భాగంగా అమ్మవారి కలశంపాటను కమిటీ సభ్యులు నిర్వహించారు. భూమా రామకృష్ణ దంపతులు 2.75 లక్షలకు దక్కించుకున్నారు. వీరిని ఆలయ కమిటీ ఘనంగా సన్మానించి కలిశాన్ని వారికి అందజేశారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- వైసీపీని వీడి టీడీపీలో చేరిన 40 కుటుంబాలు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం పట్టణంలోని 7వ వార్డు కౌన్సిలర్ బిల్లా జయలక్ష్మి, ఆమె భర్త బిల్లా రమేష్ ఆధ్వర్యంలో 40 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందిస్తూ ప్రజాపాలన సాగిస్తుందని అన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పార్టీలకు అతీతంగా పని చేస్తున్నారని షేక్ ఆసిక్, షేక్ మున్నా, ఖాదర్, రహమతుల్లా, మాలిక్, అల్తాఫ్, నూర్, హుస్సేన్, అమీర్, వినోద్ అశోక్ తదితరులు అన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, కౌన్సిలర్ లొక్కు రమేష్, ప్రధాన కార్యదర్శి పందిటి రజనీబాబు, బద్రి బాషా తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పశు సంపద పెంపునకు ప్రత్యేక ప్రాధాన్యత

- టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పశుసంపదను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తుందని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన గోకులానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎర్రగొండపాలెం నియోజక వర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మొదటి విడతలో 150, రెండవ విడతలో 184 మినీ గోకులం షెడ్లను మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్క షెడ్డు నిర్మాణానికి పశుపోషకులకులకు రూ. 2.30 లక్షలు ఇస్తున్నారన్నారు. రైతులు ఈపథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నిర్మలా దేవి, ఎంపీడీవో జాన్ సుందరం, ఏపీవో ఆకుల సాంబశివయ్య, ఈసీ నాయక్, ఎన్‌ఆర్‌ఈజీఎఎస్ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరునికి శుక్రవారం మాస కల్యాణం నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా 4వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ బి.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్‌కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని కొంగళవీడు, ఎస్.బయనపల్లి, నల్లగట్ల, బ్రాహ్మణపల్లి గ్రామాలతోపాటు ముండ్లపాడు, బురుజుపల్లి, కెఎస్‌పల్లి, కంచిపల్లి, అంబవరం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నంపెట్టే సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయం అని డీఎస్పీ యు.నాగరాజు అన్నారు. స్థానిక సాయి బాబా మందిరంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవాతత్వమే సాయి తత్వం అని, ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, హరిహరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల ఎస్ఐగా శ్రీకాంత్



కొనకనమిట్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో శుక్రవారం శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు.

స్వచ్ఛ గ్రామ పంచాయతీగా వాదంపల్లి ఎంపిక

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లి గ్రామ పంచాయతీ జిల్లా స్థాయిలో స్వచ్ఛ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. అలాగే ఎర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రి కూడాస్వచ్ఛ ఆసుపత్రికి ఎంపికైనట్లు జిల్లా అధికారులు గురువారం తెలిపారు.

పోలీసు స్టేషన్‌లో ఆయుధపూజ

మార్కాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక టౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఆయుధపూజ జరిగింది. మార్కాపురం సీఐ పి.సుబ్బారావు పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టౌన్, రూరల్ ఎస్సైలు ఎం.సైదుబాబు, పి.అంకమ్మరావులతోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

చిన్నపాటి తప్పులతో జైలుకు వచ్చే ఖైదీలు మంచి ప్రవర్తనతో మెలగాలని మండల లీగల్ సర్వీస్ అథారిటీ సభ్యులు మొఘల్ అన్వర్ బేగ్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక సబ్‌జైల్‌లో ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామయ్య, రామచంద్ర, సబ్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని షరాఫ్ బజారులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని రాచర్ల రోడ్డులో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో , ముండ్లపాడులో గల వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

కన్వెన్షన్ ప్రారంభం

పట్టణం శివారులోని నంద్యాల-ఒంగోలు జాతీయ రహదారి పక్కన మండలంలోని తంబళ్ళపల్లి గ్రామానికి చెందిన శీలం శివారెడ్డి ఏర్పాటు చేసిన తిరుమల కన్వెన్షన్‌ను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

వృత్తి విద్య నైపుణ్యంపై అవగాహన పెంచుకోవాలి

పీసీపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వృత్తివిద్య నైపుణ్యంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఒకేషనల్ ట్రైనర్స్ పల్నాటి నాగార్జునరెడ్డి, షేక్ మషీర అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదవుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆన్‌లైన్ సేవా సర్వీస్‌పై అవగాహన కల్పించేందుకు శుక్రవారం స్థానిక సచివాలయానికి విద్యార్థులను తీసుకెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒకేషనల్ కోఆర్డినేటర్ కిషోర్, ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

కురిచేడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ లీగల్‌సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ చంద్రన్న పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పడమరగంగవరంలో మాజీ జడ్పీటీసీ వరికూటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశయ్య, కొండలు, తదితరలు పాల్గొన్నారు.

మాల మహానాడు మండల మహిళా అధ్యక్షురాలిగా లూర్దుమేరి

దొనకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మాల మహనాడు దొనకొండ మండల మహిళా అధ్యక్షురాలిగా మేకల లూర్దుమేరి ఎంపికయ్యారు. ఈమేరకు గురువారం దొనకొండలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ ప్రకటించారు. కార్యక్రమంలో కొండ్రు విజయ్, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుధాకర్, రాయని చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

దొనకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినం సందర్భంగా ఒబ్బాపురం ఎస్సీ కాలనీలోని పలువురు పేదలకు బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బత్తుల బ్రహ్మయ్య, ఉపాధ్యాయుడు గోనుగుంట్ల వెంకటేశ్వర్లు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలంలో పేదలు ఇబ్బందులు పడకుండా దుప్పట్లు పంపిణీ చేసినట్టు బ్రహ్మయ్య తెలిపారు.

విద్యార్థినికి ప్రోత్సాహక నగదు పంపిణీ

పామూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ప్రథమస్థాయిలో నిలిచిన గుమ్మల స్నేహకు ప్రోత్సహం కింద రూ.20 వేలు నగదును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మాలకొండయ్య, ఎస్ఎంసీ చైర్మన్ వై.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

పీసీపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో శ్రామికులుగా నమోదైన ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. క్షేత్ర సహాయకులు గ్రామాలకు వచ్చినపుడు శ్రామికులందరూ అందుబాటులో ఉండి తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఇది చేయించుకోనివారికి ఉపాధిహామీ పథకంలో పనులు కల్పించరని తెలిపారు.

రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం

ముండ్లమూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేతో దీర్ఘకాలికంగా పెండింగ్‌లోఉన్న భూ సమస్యలను పరిష్కరించడానికి మార్గం ఏర్పడిందని తహసీల్దార్ ఎల్.లక్ష్మీన్నారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని పులిపాడులో రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ముందుగా గ్రామంలో రైతులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రీసర్వే చేసే సమయంలో రైతులు తమ వద్ద ఉన్న హక్కు పత్రాలను తీసుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సర్వేయర్ బి.మల్లికార్జున, వీఆర్వో జి.కోటయ్య, సర్వేయర్ సత్యవతి, టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

వెలిగండ్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగళ్ళూరు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీఎస్‌పురం నుంచి కనిగిరికి వెళ్తున్న బస్సు మొగళ్ళూరు సెంటర్‌లో ప్రయాణికుల కోసం ఆగింది. ఈసమయంలో కనిగిరి నుంచి కంకర లోడుతో వస్తున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టడంతో బస్సు వెనుక బాగం దెబ్బతింది. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు

వైభవంగా దసరా వేడుకలు

» ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దంపతులు



కన్యకాపరమేశ్వరి ఆలయానికి పసుపు కుంకుమతో వెళుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి దంపతులు

కనిగిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నవరాత్రుల చివరిరోజు గురువారం దసరా పండుగను పురస్కరించుకుని భక్తులు పలు దేవాలయాల్లోని దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొండదిగువన ఉన్న దుర్గామాతా ఆలయంలో దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దసరా పండుగ సందర్భంగా ఎమ్మెల్యే తన సతీమణి డాక్టర్ కవితతో కలసి పట్టణంలోని పలు దేవాలయాలను దర్శించుకున్నారు. కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ దంపతులు డాక్టర్ కవిత, డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిలను ఘనంగా సన్మానించారు. బాబా దేవాలయంలో జరిగిన పంచామృతాభిషేకాల కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని దొంతులమ్మ దేవాలయం, అంకాళమ్మ దేవాలయం, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, దుర్గామాతా ఆలయంలోని దేవతామూర్తులను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ నాయకులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

దర్శి: మండలంలో దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి.11రోజులపాటు శరన్నవరాత్రు లు ఘనంగా జరిగాయి. గురువారం దసరా పండుగ సందర్భంగా అమ్మవారు స్థానిక కనకదుర్గమ్మ, పోలేరమ్మ, దద్దాలమ్మ, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి, వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో రాజరాజేశ్వరీదేవిగా పూజలందుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు కనకదుర్గమ్మ గుడి, వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మహిళలు కోలాటం ప్రదర్శించారు. అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కురిచేడు: దసరా పర్వదినాన్ని మండల వాసులు కోలాహలంగా జరుపుకున్నారు. విజయదశమి పర్వదినం రోజున అందరూ దేవాలయాలకు వెళ్ళి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. యువకులు రకరకాల పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. దేవాయాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు.

తాళ్లూరు: మండలంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. బొద్దికూరపాడులో గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం రాత్రి తాళ్లూరులోని పార్వతీ సమేతరామలింగేశ్వరస్వామి,రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల వద్ద వేడుకలు ఘనంగానిర్వహించారు. దేవతా మూర్తుల విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. లక్కవరంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీను, కొత్తపాలెంలో జరిగిన వేడుకల్లో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, తురకపాలెం, లక్కవరంగ్రామాల్లో జరిగిన దసరా వేడుకల్లో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. తాళ్లూరులో దుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

ముండ్లమూరు: మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈదర అంకాలమ్మ దేవాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మారెళ్ల, ముండ్లమూరు, పసుపుగల్లు, ఈదర, పులిపాడు, పూరిమెట్ల, వేముల, కెల్లంపల్లి, ఉల్లగల్లు గ్రామాలలో ఆలయాలలో జరిగిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు.



దర్శి: కనకదుర్గమ్మ గుడిలో పూజలు చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

మహాత్ముని ఆశయ సాధనకు కృషిచేయాలి



కనిగిరి: గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, తదితరులు

కనిగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి అడుగు గాంధీ మహాత్ముని ఆశయ సాధన కోసం సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గాంధీజయంతి సందర్భంగా గురువారం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆశయాల సాధన కోసం పుట్టిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానన్నారు. ప్రజాశ్రేయస్సు కోసం తాను సంకల్పించిన ప్రతి పని విజయం కావటం కోసం ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రైతుబజార్‌ను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, గుడిపాటి ఖాదర్, షరీఫ్, యావర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: దొనకొండలో గాంధీ జయంతిని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాళ్ల హనుమంతరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పరుచూరి రామలింగయ్య, అచ్చుత శంకర్, గోనుగుంట్ల హరినాద్, బచ్చు చలపతిరావు, మాడిశెట్టి సురేష్, ఆలంపల్లి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలో గాంధీజీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తాళ్లూరులో సర్పంచ్ చార్లెస్ సర్జన్, బెల్లంకొండవారిపాలెంలో సర్పంచ్ సుమలతశ్రీకాంత్‌రెడ్డి, మల్కాపురంలో సర్పంచ్ కాలేషావలి, విఠలాపురంలో సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి, బొద్దికూరపాడుల్లో సర్పంచ్ శ్యాంసన్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో కనిగిరికి గుర్తింపు

» మహిళలకు పురస్కారాలు



ఇంటిపై అరటి, ఉసిరి, బీర, తదితర మొక్కలను పెంచుతున్న కేతినేని సుశీల

కనిగిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కనిగిరికి గుర్తింపు తీసుకొచ్చారు మహిళలు. పట్టణంలోని ఎన్జీవో కాలనీకి చెందిన వీరబ్రహ్మేంద్ర మహిళా సమైఖ్య గ్రూపునకు చెందిన ఓమహిళ రాష్ట్రస్థాయి పురస్కారానికి, పట్టణ సమీపంలోని టకారిపాలెంకు చెందిన ఓవనిత జిల్లాస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు.

పట్టణంలోని ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న కేతినేని సుశీల తన ఇంటి టెర్రస్‌నే ఉద్యా నవనంలా మార్చారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, దానిమ్మ, జామ, అరటి, ఉసిరి, చెరకు లాంటి మొక్కలను పెంచుతున్నారు. మొక్కల పెంపకంలో సేంద్రియ ఎరువులనే ఉపయోగిస్తున్నారు. టెర్రస్ గార్డెన్‌లో రాష్ట్రస్థాయి పురస్కారానికి ఆమె ఎంపికయ్యారు.

ఈనెల 6న విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

అలాగే, పట్టణ సమీపంలోని టకారిపాలెంకు చెందిన బుజ్జి స్వయం సహాయక సభ్యురాలు నజ్మాభాను జిల్లా స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. ఇంటి మిద్దెపై పచ్చదనాన్ని పెంపొందిస్తూ కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, తదితర మొక్కలను విస్తతంగా పెంచినందుకు పురస్కారం లభించింది. ఈనెల 6న ఒంగోలులో కలెక్టర్ చేతులమీదుగా జిల్లాస్థాయి పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈసందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ



పోలవరంలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న డాక్టర్ లక్ష్మి

ముండ్లమూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని పోలవరంలో రూ.14 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో సైతం కూటమి ప్రభుత్వం సీసీ రోడ్లు నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగిస్తుందన్నారు. పల్లె పండుగ ద్వారా మండలంలో రూ.3 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించినట్టు చెప్పారు. పశుపోషకులకు గోకుల షెడ్లు పెద్ద ఎత్తున మంజూరుచేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు కొర్రపాటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఈవో చంద్రశేఖర్

ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

తాళ్లూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు కార్యనిర్వహణాధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. శివరాంపురం గ్రామసమీపాన రైతుసాధికార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కావ్య అగ్రికల్చర్ సొల్యూషన్స్ ఫ్యాక్టరీని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఫ్యాక్టరీ చైర్మన్ గిరిధర్ అధ్యక్షతన జరిగిన సభలో సీఈవో చంద్రశేఖర్ మాట్లాడారు. రైతులు అభ్యున్నతి కోసం ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రైతులు మార్కెట్ డిమాండ్ ఉన్న ఔషధ, సుగంధ మొక్కల పంట సాగుచేపట్టాలన్నారు. రైతులు ఒకే పంటను అధికంగా వేయటం వల్ల ఉత్పత్తి అధికంగా ఉండి మార్కెట్ రేట్ తక్కువగా ఉండటంతో నష్టపోతున్నారన్నారు. ఔషధ మొక్కల పెంపకానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రైతు సాధికార సంఘం సభ్యులు లక్ష్మీసుజాత, విజయలక్ష్మిలు రైతులను ప్రోత్సహిస్తూ, సహకారం అందించటం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో ప్రదీప్, తోట మేనేజింగ్ డైరెక్టర్ జగదీష్, మాజీబాడ్మింటన్ కోచ్ పున్నయ్యచౌదరి, వ్యవసాయ నిపుణులు డీవీఆర్ రాజీవ్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా దేవకి వెంకటేశ్వర్లు



దేవకి వెంకటేశ్వర్లు

కనిగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శ్రీశైలం, శ్రీకాళహస్తి దేవాలయాలకు పాలకమండలి సభ్యులను నియమిస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యునిగా జనసేన పార్టీ నుంచి కనిగిరి నియోజకవర్గానికి కేటాయించారు. అందులోభాగంగా కనిగిరి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు దేవకి వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

దీంతో కనిగిరిలోని ప్రముఖులు, వ్యాపారస్థులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు రాష్ట్ర నలుమూలల నుంచి దేవకికి అభినందనలు తెలిపారు.



ఆయుధ పూజలో పాల్గొన్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

స్టేషన్‌లో ఆయుధ పూజలు

కనిగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పోలీసులు పట్టు వస్త్రాలు ధరించి స్థానిక సర్కిల్ పరిధిలోని కనిగిరి, హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్‌లలో దసరా పండుగ సందర్భంగా గురువారం ఆయుధ పూజలు నిర్వహించారు. డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డీఎస్పీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సీఐ షేక్ ఖాజావలి అమ్మవారికి హారతులిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీరాం, మాధవరావు, ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత వసంతోత్సవం

పామూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల వేడుకల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా వాసవీమాత దేవస్థానం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం, వసంతోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఎస్‌పురం ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ పర్యవేక్షణలో పోలీస్ బందో బస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కోటా నరసింహా రావు, ఎం.మధుసూదనరావు, దరిశి రాజేష్, రామడుగు బాబు, గాదంశెట్టి గురు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషిచేయాలి

పామూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ పటిష్టతకు కృషిచేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక సీఎస్‌పురం రోడ్డులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత భారత్, బలమైన బీజేపీ నినాదంతో బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారత్ అగ్రదేశాల సరసన నిలబడటమే కాకుండా 2047లో విశ్వవిజేతగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు అమరసింహం నరాల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జేవీఎల్ నారాయణ, కేవీ రమణయ్య, ఉమ్మడి శ్రీను, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ప్రయోజనం

పామూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పేద మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ తగ్గింపుతో ప్రయోజనం చేకూరిందని జిల్లా అధికారి ఎ.బాజిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో వాహనాలు, వ్యవసాయ పరికరాలు, మందులు, విద్యుత్ వస్తువులు, నిత్యావసర సరుకులు వంటి అనేక రంగాల్లో ప్రజలకు భారీగా ఆదాయం కలుగుతుందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాసుదేవరావు, ఏఈ షేక్ మస్తాన్‌వలి, ఏపీవో బి.మాల్యాద్రి, పంచాయతి కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు అలాగే సీఎస్‌పురం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ హుసేన్, ఎంపీడీవో వి. ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించడం ద్వారా రైతులకు ఎంతో లాభదాయకంగా మారిందని పీసీపల్లి పీఏసీఎస్ చైర్మన్ పరిమి ఈశ్వరయ్య అన్నారు. స్థానిక రైతుసేవాకేంద్రంలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో పీఏసీఎస్ డైరెక్టర్ పిచ్చిరెడ్డి, ఎంపీడీవో జీవీ కృష్ణారావు, తదిత రులు పాల్గొన్నారు.

తాళ్లూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వ పలు వస్తువులకు జీఎస్టీ తగ్గించిందని డీఎల్‌డీవో పద్మజ అన్నారు. శుక్రవారం తూర్పుగంగవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తగ్గిన ధరలకే వస్తువులను విక్రయించకుంటే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.అజిత, డిప్యూటీ ఎంపీడీవో నాగమల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి తిరుమలరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో అబ్దుల్ కరీమ్, ఎస్ఐ కమలాకర్, ఏఈవో కీర్తిరావు, టీడీపీ నేతలు సుంకర రాఘవరెడ్డి గంగినేని శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం హర్షం

దొనకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1209 మంది డీఈవో పూల్ ల్యాంగ్వేజ్ పండిట్స్‌కు డీఈవో పూల్ నుండి విముక్తి కల్పిస్తూ స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి కల్పిస్తూ జారీ చేసిన జీవో పట్ల తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈసందర్భంగా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెహమాన్, మండ్లా శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా వారికి శాశ్వత స్థానాలు లేక ఒకచోట పనిచేస్తూ మరోచోట జీతం తీసు కుంటూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవల హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ వారి సమస్య పరిష్కారం కాలేదన్నారు. వారి ఇబ్బందులను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం టీడీపీ ఎమ్మెల్సీల ద్వారా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేష్ దసరా పండుగ రోజు బాషా పండితుల సమస్యను పరిష్కరించేలా ఉత్తర్వులు జారీ చేసి రాష్ట్రవ్యాప్తంగా 1209 మంది ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని వారు ఆనందం వ్యక్తం చేశారు.

పసుపుగల్లులో చోరీ

ముండ్లమూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో మారం కోటిరెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి రూ.1.50 లక్షల నగదు, నాలుగు సవర్ల బంగారు వస్తువులు అపహరించినట్టు బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతనెల 10న కోటిరెడ్డి తన భార్య సరోజనమ్మకు ఆరోగ్యం బాగా లేకపోవటంతో హైదరాబాద్ వెళ్లారు. తిరిగి శుక్రవారం రాగా తాళాలు పగులకొట్టి ఉన్నాయి. దీంతో ఆందోళనతో ఇంటి లోపలికి వెళ్లిచూడగా, బీరువా తాళాలు పగులగొట్టి నగదు, నగలు అపహరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కమలాకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

తాళ్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ బొడ్డురాములు, పూర్వపు కార్యదర్శి రాజా రమేష్‌లు లక్షలాది రూపాయల నిధులను దుర్వినియోగం చేశారన్న ఫిర్యాదు మేరకు ఒంగోలు డీఎల్‌పీవో పద్మజ శుక్రవారం శివరాంపురం సచివాలయంలో విచారణ చేపట్టారు. నిధుల దుర్వినియోగంపూ అనేకమార్లు జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు ఉపసర్పంచ్ నారిపెద్ది రామ్మూర్తి ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. దీనిపై డీఎల్‌డీవో విచారణ చేశారు. బిల్లుల చెల్లింపుల తాలూకు రికార్డులను, గ్రామపంచాయతీ తీర్మాణాలను పరిశీలించారు. ఈ విచారణలో ఎంపీడీవో పి.అజిత, డిప్యూటీ ఎంపీడీవో నాగమల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు షేక్ షహనాజ్‌బేగం, రాజారమేష్, మాజీ ఎంపీటీసీ జి.లక్ష్మినారాయణ, మారిశెట్టి హనుమంతరావు, సర్పంచ్ కుమారుడు రమేష్ , ఎం.బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు,

రైతులందరికీ రుణాలు

పీసీపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులందరికీ రుణాలు ఇస్తున్నట్టు సొసైటీ చైర్మన్ పరిమి ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీలో బకాయి ఉన్న రైతులతో మాట్లాడి జమ అయ్యేలా చూడాలన్నారు. అవసరమైన రైతులందరికీ రుణాలు ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఉండేల పిచ్చిరెడ్డి, బ్యాంకు మేనేజరు క్రిష్ణారెడ్డి, సూపర్‌వైజర్ శ్రీను, సీఈవో బాషా, సిబ్బంది పాల్గొన్నారు.





పిట్టలవానిపాలెం: చందోలులో విశేష అలంకరణలో శ్రీబగళాముఖి అమ్మవారు

వైభవంగా విజయదశమి వేడుకలు

విజయదశమి వేడుకలు వైభవంగా ముగిశాయి. నవరాత్రులు పూజలు నిర్వహించిన భక్తులు దసరా రోజు ఆలయాలకు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో సామూహిక పూజలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. ప్రజలు ఆయుధ పూజలో నిమగ్నమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమం పూర్తిచేశారు.

- బాపట్ల, ఆంధ్రజ్యోతి

ఏఓల ప్రమోషన్‌లు.. ఇంకెప్పుడు !?



- పదోన్నతి ఫైల్‌కు కొర్రీల మీద కొర్రీలు

రేపల్లె, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ అధికారులకు ఏఓ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)ల ప్రమోషన్‌లకు సంబంధించిన ఫైల్‌తో బంతాట ఆడుతున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ ప్రమోషన్‌ల ప్రక్రియ ఈ ఏడాది మేలోనే ముగిసింది. కేవలం ఉమ్మడి గుంటూరు జిల్లా లో మాత్రమే ఇంకా పురిటి నొప్పులు పడుతూనే ఉంది. సీనియర్ అసిస్టెంట్ నుంచి ఏఓలు గా ప్రమోషన్ పొందే వారి సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ సంబంధిత ఫైల్ కు మాత్రం అధికారులు పోటీలుపడీ మరీ కొర్రీలు వేస్తుండటం చర్చ నీయాంశంగా మారింది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా లో 57 మండలాలు ఉండగా 67 ఏఓ పోస్టు లు ఉన్నాయి. వాటిలో సుమారు 13 ఏఓ పోస్టు లు ఖాళీ గా ఉన్నాయి. నిబంధనల ప్రకారం అధికారులు అర్హులైన సీనియర్ అసిస్టెంట్ లకు పదోన్నది కల్పించి ఆ పోస్టు ల్లో నియమించాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎప్పుడో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఎప్పుడూ ఏదో ఒక సాకు...

ఉమ్మడి జిల్లాలో బొల్లాపల్లి, గురజాల, శావల్యాపురం, పిట్టలవాని పాలెం, ప్రత్తిపాడు, ఈపూరు, నూజెండ్ల,రాజుపాలెం, రొంపిచర్ల మండలాల్లో పూర్తి స్థాయి ఖాళీ లు వున్నాయి. అవికాక మరికొన్ని ఖాళీలు కూడా ఉన్న ట్లు తెలుస్తుంది. గత ఐదు నెలలుగా పదోన్నతికి అర్హత కలిగిన సీనియర్ అసిస్టెంట్‌లు జిల్లా పరిషత్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా సంబంధిత ఫైల్ ను సక్రమంగా రూపొందించాల్సిన ఏ సెక్షన్ అధికారులు ఏదో ఒక పొరపాటు చేయటం దానిమీద అధికారులు చర్చించాలి(డిస్కషన్)అని రాయడం పరిపాటిగా మారింది.

ప్యానల్ లేకుండా జాబితా తయారు...

వాస్తవానికి ప్రమోషన్ ప్రక్రియ కు ముందు అర్హులైన వారితో ప్యానల్ రూపొందించాలి. జిల్లా పరిషత్ అధికారులు తాజాగా రూపొందించిన జాబితా వివాదాస్పదం కావటానికి అదే కారణం గా కనిపిస్తుంది. కనీసం 30 మంది తో ప్యానల్ రూపొందించి అందులో అర్హులైన వారికి ప్రమోషన్‌లు

(మిగతా 6లో..)

అమృత్ 2.0..

పురాల పౌరుల తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ 2.0 పథకం అమలకు ఆమోదం లభించింది. రాష్ట్ర సచివాలయంలో సీఎం నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో అమృత్ పనులపై చర్చించారు. పనులు చేపట్టేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతో పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అయింది. రూ 1,136కోట్లు వ్యయంతో పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెండర్లు నిర్వహించేందుకు పబ్లిక్‌హెల్త్ శాఖ సమాయత్తమవుతోంది.

- రూ 1,136 కోట్ల వ్యయంతో 86 పనులు
- టెండర్లు నిర్వహించేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు



అమృత్ పథకంలో ప్రతిపాదించిన నరసరావుపేటలోని కత్తవ చెరువు

(అద్దంకి, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని, మున్సిపాలిటీలు, గుంటూరు కార్పొరేషన్ సహా అమృత్ పథకం కింద నీటి పథకాల విస్తరణ, చెరువుల అధునికీకరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా పురపాలక సంఘాల్లో తాగు నీటి పథకాలను రానున్న 25 ఏళ్లలో పెరిగే జనాభాకు అనుగుణంగా విస్తరించడం. నీటి నిల్వ చెరువులు అభివృద్ధి. పైపులైన్లు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం. 24/7 నీటిని సరఫరా చేసే దిశగా నీటి పథకాలను అభివృద్ధి. మురుగునీటి సమస్యలపై దృష్టి సారించడం. మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌ల నిర్మాణం. పట్టణాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు చెరువులను అభివృద్ధి చేయడం. చెరువుల్లో పూడిక తీత, కట్టలు పటిష్టం, వీటిపై వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం. పట్టణాల్లో వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన సెంటు స్థలం కాలనీలకు తాగు నీటి సరఫరా. అయా కాలనీలకు పైపు లైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వడం. అయా పనులు అమృత్ పథకం కింద చేపట్టనున్నారు. అయా పనులు పూర్తి చేస్తే పురాల్లో తాగు, మురుగు నీటి కష్టాలు తీరుతాయి. దీనికి గాను 1092.40 కోట్ల వ్యయంతో గతంలో టెండర్లు నిర్వహించగా ఎస్ఓఆర్ రేట్లు పెరగడంతో టెండరును నిలిపివేశారు. దీంతో ప్రామాణిక రేట్లు(ఎస్ఓఆర్) పెరగడంతో 86 పనుల వ్యయం రూ.1,136కోట్లకు పెరిగింది. పెరిగిన రేట్లకు అనుమతికి సంబంధించిన ఫైల్ మునిసిపల్ పరిపాలన విభాగం వద్ద గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం మంత్రి మండలి ఆమోదంతో ఫైలు కదిలింది. ఆయా అధికారులు టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తొలిసారిగా చామ్ విధానంలో పనులు

రాష్ట్రంలోనే తొలిసారిగా అమృత్ పథకం 2.0 కింద చేపట్టే ప్రగతి పనులను నూతన విధానంలో చేపట్టనున్నారు. రాయితీ హైబ్రీడ్ యాన్యుటీ మోడల్(చామ్) కింద పనులు చేపట్టేందుకు మంత్రివర్గం ఆమోదించింది. ఇప్పటి వరకు జాతీయ రహదారుల నిర్మాణంలో వినియోగించిన పీపీపీ తరహాలోనే చామ్ విధానం కూడా ఉంది. 50శాతం నిధులు ప్రభుత్వం ఇస్తోంది. 50శాతం నిధులు కాంట్రాక్టర్ భరించాలి. సదరు సంస్థ ఖర్చు చేసే 50 శాతం నిధులను వడ్డీతో కలిపి 40 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ విధానంలోనే గతంలో కూడా టెండర్లు నిర్వహించగా అవగాహన లేమితో కాంట్రాక్టర్లు టెండర్ దాఖలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో టెండర్‌ను వాయిదా వేశారు. కాంట్రాక్టర్లకు పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. దీంతో ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ ప్రతిపాదించిన పనులు స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. సదరు సంస్థ టెండరు దాఖలు చేసేందుకు సమాయత్తమవుతున్నట్టు సమాచారం.

దారి సమస్యపై జాగేల!

- ఈపూరుపాలెం సీమౌత్ వివాదం మళ్లీ మొదటికి
- మత్స్యకారుల ఆందోళన నేపథ్యంలో విచారణకు గతంలోనే కమిటీ
- రెండు వర్గాల అంగీకారంతో పనులు చేపట్టేలా ఆగస్టులో నిర్ణయం
- తమ ప్రయోజనాలు కాపాడాలంటూ తాజాగా రోడ్డెక్కిన గంగపుత్రులు

(బాపట్ల, చీరాల ఆంధ్రజ్యోతి)

సమస్య చాలా సున్నితమైనది.. గంగపుత్రుల దీర్ఘకాలిక ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశం. నాలుగు తీరప్రాంత గ్రామాలకు చెందిన వేలమంది మత్స్యకారులు ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ ఆక్రమణలకు గురికావడంపై కన్నెర్ర చేస్తూ ఈ ఏడాది జూన్‌లోనే రోడ్డెక్కారు. మత్స్యకారులు అంతా కూడా చీరాల డివిజన్ పరిధిలోకి రావడం, వివాదంలో ఉన్న స్థలం బాపట్ల రెవెన్యూ డివిజన్ కింద ఉండడం గమనార్హం. ఈ సమస్య ఇప్పటికీ ఓ కొలిక్కి రాకపోవడం విస్మయం కలిగిస్తోంది. ఓ దశలో మత్స్యకారులే సీమౌత్ పునరుద్ధరణకు పూనుకోగా గతంలోనే తీరంలో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. పలు దఫాలుగా కలెక్టరేట్ ముట్టడి యత్నాలు, నిరసనలు చేపట్టగా.. వారికి దన్నుగా ప్రజాసంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. వివాదం చినికిచినికి గాలివానగా మారుతుండడంతో స్థలంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేసి.. పరిష్కారం కోసం ఓ కమిటీని అప్పటి కలెక్టర్ వెంకటమురళి నియమించారు. ఇందులో బాపట్ల ఆర్డీవో, డీఎస్పీతోపాటు ఆరుగురు అధికారులు, మత్స్యకారుల ప్రతినిధులుగా ఏడుగురికి ఆ కమిటీలో చోటు కల్పించారు. పలు దఫాలుగా కమిటీ సమావేశం కావడంతో పాటు రెవెన్యూ రికార్డులను పరిశీలించి ప్రాథమిక నివేదికను అప్పటి కలెక్టర్ వెంకటమురళికి కమిటీ అందించింది. దీని ఆధారంగా ఇరు వర్గాల ఆమోదంతో ఈపూరుపాలెం కాలువ స్ట్రె యిట్ కట్ పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఆగస్టు 14న జరిగిన సమావేశంలో కమిటీలో ఉన్న అధికారులతో పాటు, మత్స్యకారుల ప్రతినిధులు, నేతలు కూడా హాజరయ్యారు. సీమౌత్ పునరుద్ధరణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆ సమావేశంలోనే ఓ నిర్ణయానికి వచ్చారు. సమస్యకు పరిష్కారం లభించిందనే సంకేతాలను కూడా అధికారులు పంపించారు. కానీ, సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఈ నెల 1న భారీ సం ఖ్యలో మత్స్యకారులు బాపట్ల పట్టణాన్ని దిగ్బంధించి ని రసన చేపట్టారు. కొంతమంది రియల్టర్లు తీరప్రాంత భూములను చెరబడుతూ తమకు అన్యాయం చేస్తున్నారంటూ నినదించారు. దాదాపు పదిగంటలపాటు రో డ్డు మీదే బైఠాయించిన మత్స్యకారులు చివరికి కలెక్టర్ హామీతో శాంతించారు. ఈ మొత్తం ప్రక్రియలో అ త్యంత సున్నితమైన అంశాన్ని పరిష్కరించడంలో వ్య వస్థల నిర్లక్ష్యంతోపాటు, కొంతమంది ప్రయోజనాలు కూడా దీనివెనక దాగి ఉన్నాయనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

మత్స్యకారుల డిమాండ్ ఏంటి?

చీరాల-బాపట్ల మండల సరిహద్దుల్లో ఉన్న ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ మురుగు కాల్వ సముద్రంలో కలిసే దారిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడాన్ని మత్స్యకారులు తప్పుబడుతున్నారు. ఇందులో సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘన కూడా ఉందనేది గంగపుత్రుల ఆరోపణ. కాలువ పూడ్చివేయడం వల్ల సముద్రంలోకి పడవలు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతాయని, తద్వారా తమ ఉపాధికే ముప్పు వాటిల్లే ప్రమాదముందనే ఆవేదనను మత్స్యకారులు వ్యక్తం చేస్తున్నారు. తీర ప్రాంతంలో ఆక్రమణలను తొలగించి కాలువను యథాస్థితిలోనే ఉంచాలని అప్పుడే తమ భవిష్యత్ ప్రయోజనాలకు విఘాతం కలగదనేది మత్స్యకారుల డిమాండ్‌గా ఉంది

అసైన్డ్ భూమికి సేకరణా!

ఈ వివాదం పరిష్కారం కోసం గతంలో వేసిన కమిటీ ఇచ్చిన నివేదక ప్రకారం సీ మౌత్‌ను తిరిగి ఎల్ ఆకారంలోకి తేవాలంటే దాదాపు 11 ఎకరాలు అవసరం పడుతుందని తేల్చారు. ఇది కాకుండా ప్రస్తుతం మత్స్యకారులు డిమాండ్ ప్రకారం దారిని యథాస్థితికి తేవాలంటే దాదాపు మూడు ఎకరాలు కోల్పోవాల్సి వస్తుందని కమిటీ రిపోర్టు ఇచ్చినట్లు సమాచారం. రెవెన్యూ రికార్డుల ప్రకారం 3.42 ఎకరాల అసైన్డ్ భూమి ప్రైవేటు వ్యక్తుల అనుభవంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదంతా కూడా అసైన్డ్ భూమేనని రెవెన్యూ రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి. కానీ, విచిత్రంగా ఈ భూమి విషయంలో భూ సేకరణకు వెళ్లాలనే ప్రతిపాదనలు గతంలో చేయడం ఆశ్చర్యం కలిగించేదిగా ఉందని గంగ పుత్రులు ఆరోపిస్తున్నారు.

విశాల ప్రయోజనాల దృష్ట్యా...

సీ మౌత్ వివాదానికి శాశ్వత పరిష్కారం లభించాలంటే తిరిగి దానిని ఎల్ ఆకారంలోకి తేవాల్సి ఉంది. ఇందుకు మొత్తం 11 ఎకరాలు కావాల్సి ఉండగా దీనిలో దాదాపు నాలుగు ఎకరాలు అసైన్డేనని తెలుస్తోంది. పట్టాభూమి విషయంలో భూసేకరణకు వెళ్లడంపై ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, అసైన్డ్ భూమి విషయంలో మీనమేషాలు లెక్కించడం మత్స్యకారులు చేస్తున్న ఆరోపణలకు బలం చేకూర్చేదిగా ఉంది. విశాల ప్రయోజనాలు ముడిపడి ఉంటే ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిని తిరిగి తీసుకునే అధికారం చట్టం కల్పించింది. ఈ క్రమంలో నష్ట పరిహారం అనేది సదరు అసైనీ ఆర్థిక స్థితిగతుల ఆధారంగానే నిర్ణయం జరగాలని కూడా అసైన్డ్ చట్టం నిర్వచిస్తోంది. కానీ ఈ నిబంధనలకు తూట్లుపొడిచేలా అసైన్డ్ భూమి విషయంలో కూడా సేకరణ ప్రతిపాదనలు తేవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నివేదిక సిద్ధం చేయండి

మత్స్యకారుల సీమౌత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు పక్కా నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చీరాల, బాపట్ల ఆర్డీవోలు చంద్రశేఖర్ నాయుడు, గ్లోరియాతో కలిసి సుమారు 50 మంది మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. అలాగే అధికారులు, మత్స్యకారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. క్షేత్ర స్థాయిలో సీ మౌత్ పరిశీలించి, వాస్తవాలకు సంబంధించిన నివేదిక అందించాలని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలో శుక్రవారమే అధికారులు వివాదం నెలకొన్న సీ మౌత్‌ను పరిశీలించారు.



న్యాయం చేయాలని బాపట్ల పట్టణంలో గంగపుత్రుల ర్యాలీ (ఫైల్)



చీరాలలో మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సొసైటీ బ్యాంకుల్లో భోక్తలను వదిలేది లేదు

- డీసీసీబీ ఛైర్మన్ మక్కెన

గుంటూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో అక్రమంగా రుణాలు పొందిన భోక్తలు ఎంతటి వారైనా.. వదిలేది లేదని మాజీ ఎమ్మెల్యే, బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు హెచ్చరించారు. స్థానిక బ్రాడీపేటలోనున్న ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందన్నారు. దీనిపై ఇప్పటికే విచారణ జరిగిందని, నివేదికలు వచ్చాక చర్యలుంటాయని పునరుద్ఘాటించారు. గురజాలలో కోల్డ్ స్టోరేజ్ యజమానితో అక్రమార్కులు కుమ్మక్కై రూ.12 కోట్లు కుంభకోణం చేశారని, ఇందులో కొందరు అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు

(మిగతా 6లో..)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితరులు

ఆటో డ్రైవర్లకు రూ.15,000

- జిల్లా వ్యాప్తంగా 6,859 మంది ఆటో,క్యాబ్ డ్రైవర్లకు లబ్ధి
- నేడు ఖాతాల్లో నగదు జమ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆటో డ్రైవర్ సేవలో పథకానికి ప్రభుత్వం శనివారం శ్రీకారం చుట్టనుంది. దీనిద్వారా ఆటోక్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.15,000 వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. జిల్లా వ్యాప్తంగా 6,859 మంది ఆటో డ్రైవర్లను ఈ పథకానికి అర్హులుగా యంత్రాంగం గుర్తించింది. గ్రామ, వార్డు స్థాయిలోని సచివాలయ సిబ్బంది ద్వారానే లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకంగా ప్రభుత్వం పూర్తి చేసింది. ఆన్‌లైన్ ద్వారానే మొత్తం ప్రక్రియ జరిగిందని, అర్హత ఉండీ ఎవరైనా పథకం ప్రయోజనాలు దక్కకుంటే మలివిడత దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని రావాణా శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. నియోజకవర్గాల వారీగా ఆటో డ్రైవర్ సేవలో పథకాన్ని వేడుకగా ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు

అత్యధికంగా చీరాలలో...

ఆటోడ్రైవర్ సేవలో పథకంలో భాగంగా జిల్లాలో అత్యధికంగా చీరాల నియోజకవర్గంలో 1,270మందికి లబ్ధి చేకూరనుంది. అద్దంకి 1,262, వేమూరు 1,207, బాపట్ల 1,160, రేపల్లె 1,034, పర్చూరు నియోజకవర్గంలో 926మందికి రూ.15,000 చొప్పున వారి ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.

బాపట్ల జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు

- స్వచ్ఛ స్కూల్ కింద కావూరు ప్రభుత్వ హైస్కూల్‌కు రాష్ట్రస్థాయి అవార్డు
- జిల్లా స్థాయిలో వివిధ కేటగిరిల కింద 49అవార్డులు
- బెస్ట్ మున్సిపాలిటిగా అద్దంకి : కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ మిషన్‌లో భాగంగా బాపట్ల జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు వచ్చినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 జనవరిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి నెలా మూడోవ శనివారం ఏదో ఒక థీమ్ తీసుకొని స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా బాపట్ల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ఒక అవార్డు, జిల్లా స్థాయిలో వివిధ కేటగిరిల కింద 49 అవార్డులు రావటం జరిగిందని తెలిపారు. బాపట్ల జిల్లా కావూరు ప్రభుత్వ హైస్కూల్‌కు రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ స్కూల్ కింద అవార్డు వచ్చిందన్నారు. జిల్లాలో బెస్ట్ మున్సిపాలిటీగా అద్దంకి పురపాలక సంఘం నిలిచిందన్నారు. ఈ నెల 6న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదగా రాష్ట్ర స్థాయి అవార్డును తీసుకోవడం జరుగు తుందన్నారు. మిగిలిన అవార్డులు జిల్లా స్థాయిలో అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ఫలించని చర్చలు.. నిలిచిన ఉత్సవం

గ్రామంలో మోహరించిన పోలీసులు.. అంగీకారానికిరాని ధర్మకర్తలు, అర్చకులు



నూజెళ్ళపల్లిలో ధర్మకర్తలతో మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో, డీఎస్పీ ,దేవాదాయశాఖ అధికారులు

పంగులూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్ళుగా నూజెళ్ళపల్లి గ్రామంలో గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తలు, అర్చకుల మధ్య నెలకొన్న వివాదంతో నిలిచిపోయిన దసరా ఉత్సవాలను జరిపించాలన్న ఉన్నతాధికారుల ప్రయత్నాలు చర్చలకే పరిమితమయ్యాయి. గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో విజయదశమిరోజున ఏటా ప్రజలు పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ఉత్సవం జరుపుకునేవారు. కొన్నేళ్ళుగా స్వస్తి వాచకం నిర్వహించే విషయంలో వివాదం తలెత్తడంతో దసరా ఉత్సవాలు నిలిచిపోయాయి. ఈ విషయమై నెలకొన్న వివాదానికి తెరదించి ఉత్సవం జరిపించాలనే ఉద్దేశంతో, గతనెల 29న చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, డీఎస్పీ మోయిన్, దేవాదాయశాఖ ఈవో శ్రీనివాసరావు పంగులూరు రెవెన్యూ కార్యాలయంలో చర్చలు జరిపారు. న్యాయనిపుణుల సలహామేరకు దేవాదాయశాఖ అధికారులు తీసుకునే నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉత్సవ నిర్వహణకు సహకరించాలని నిర్ణయించారు. అయితే దసరా పండుగరోజు గ్రామంలో ఉత్సవం నిర్వహించేందుకు ధర్మకర్తలు, అర్చకస్వాములతో ఆర్డీవో, ఇతర అధికారులు చర్చించినా వారు ఒప్పుకోలేదు. ఉత్సవం ఏదోరూపేణా జరిపించాలని సమయం మించిపోయే వరకు అధికారులు ప్రయత్నాలు చేసినా ధర్మకర్తలు, అర్చకులు సహకరించని పరిస్థితి. దైవ సంబంధమైన విషయాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులు సున్నితమైన అంశంగా భావించడం, దేవాదాయశాఖ సూచనలను అర్చకులు, ధర్మకర్తలు ఆలకించక పోవడంతో దసరా ఉత్సవ నిర్వహణలేకుండానే అధికారులు రాత్రి తొమ్మిది గంటల సమయంలో గ్రామం నుంచి వెనుదిరిగారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా ఆయుధపూజ

బాపట్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దుష్ట శిక్షణ-శిష్ట రక్షణకు పోలీసులు కట్టుబడి ఉండాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా ఏఆర్ కార్యాలయంలో విజయదశమి సందర్భంగా ఆయుధపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ తల్లిదండ్రులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద మంత్రాలతో పూజా కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు యంత్రాంగం సమిష్ఠ కృషితో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ విజయవంతంగాముందుకు సాగాలన్నారు. శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో జీవనానికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు, వస్తువులు, ఆయుధాలను దైవంగా భావించి పూజించటం సాంప్రదాయంగా వస్తుందని తెలిపారు. విజయానికి చిహ్నమైన విజయదశమి పర్వదినం అందరికి సుఖసంతోషాలతో, అభివృద్ధి, విజయాలు అందించాలని ఆకాంక్షించారు. ఆయుధపూజ అనేది పోలీసు భద్రతా దళాలలో అత్యంత ప్రాముఖ్యమైనదన్నారు. ఈ సందర్భంగా బెల్ ఆఫ్ ఆర్మ్‌లోని ఆయుధాలు, బీడీటీమ్ పరికరాలు, ఇతర ఆయుధాలతోపాటు మోటారు ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా విధులు నిర్వహించాలంటూ ప్రార్థిస్తూ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, సిసిఎస్ డిఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఎస్‌బి టూ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు, పట్టణ సీఐ ఆర్.రాంబాబు, ఆర్ఐలు షేక్.మౌలుద్దీన్, టి.శ్రీకాంత్, సీఐ హరికృష్ణ, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హాజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.


సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.


రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు


నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, అనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన సయ్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభుత్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు


హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్


హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు ఆటో డ్రైవర్ల సేవలో...

పాల్గొననున్న జిల్లా ఇంచార్జి మంత్రి

అద్దంకి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు అద్దంకి పట్టణంలోని ఎస్‌బీ కన్వెన్షన్ హాలులో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి, కలెక్టర్ వినోద్‌కుమార్‌లు పాల్గొంటారని తెలిపారు.

పనుల మంజూరు ప్రణాళికకు గ్రామసభలు

మార్టూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2026-27 ఆర్థికసంవత్సరానికి పనుల గుర్తింపు కోసం శుక్రవారం మండలంలోని పలుగ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామ సభలలో గ్రామాలలో అవసరమైన పనులను, చేపట్టబోయే పనులకు సంబంధించి,ఒక ప్రణాళికను తయారుచేసి ఉన్నత అధికారులకు పంపిస్తారు. అందులో భాగంగా ఏపీవో లక్ష్మీనారాయణ మండలంలోని రాజుగారిపాలెంలో జరిగిన గ్రామ సభలో పాల్గొన్నారు.

గాంధీ జయంతి వేడుకలు

అద్దంకి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి) : గాంధీ జయంతి సందర్భంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్లు అత్తులూరి రమేష్, కంపా రజనీ, విజయలక్ష్మి, గోపి, బలరామిరెడ్డి, అర్జునరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి


జయరాజ్(ఫైల్)

వేటపాలెం(చీరాల), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం - చీరాల జాతీయ రహదారిలోని అక్కయ్యపాలెం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారంచేడు మండల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముద్దన జయరాజ్(54) మృతి చెందారు. అందిన వివరాల ప్రకారం... స్థానిక కొత్తపేటలో నివాసముంటున్న జయరాజ్ వేటపాలెం నుంచి బైక్‌పై చీరాల వస్తుండగా ఎదురుగా వస్తున్న ప్రయివేట్ బస్సు ఒక్కసారిగా గేదెలను ఢీ కొట్టింది. దీంతో ఓ గేదె జయరాజ్ వాహనానికి అడ్డు పడటంతో దానిని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరాడు. అప్పటి నుంచి చీరాల్లోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

- రూ.23.75 కోట్ల నిధులతో క్రిటికల్ కేర్ యూనిట్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన
- నాణ్యమైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు చెక్
- చీరాలలో ఇప్పటికే 100 బెడ్లతో వైద్య సదుపాయాలు


క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సామాన్య పేద ప్రజలకు సైతం కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా రూ.23.75 కోట్ల నిధులతో చీరాల ఏరియా వైద్యశాలలో క్రిటికల్ కేర్ యూనిట్‌కు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చీరాల చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఏరియా హాస్పిటల్ 100 బెడ్లతో వైద్య సేవలు అందించడం ఆనందదాయకమన్నారు. ఇప్పటి వరకు అత్యవసర సమయంలో మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు పరుగులు తీసే క్రమంలో కుటుంబ సభ్యులను ఎంతోమంది కోల్పోయిన పరిస్థితులు ఉన్నాయని గుర్తు చేశారు. ఇక నుంచి ఆ పరిస్థితి తలెత్తబోదన్నారు. ప్రతి పేదవాని ఆరోగ్య విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ఆలోచనలు చేస్తున్నట్లు చెప్పారు.

ఎంపీడీవో కార్యాలయ సబార్డినేట్ మృతి

అద్దంకిటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : అద్దంకి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న శింగరకొండపాలేనికి చెందిన కొండలరావు(54) అనారోగ్య కారణంగా గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని శుక్రవారం ఎంపీడీవో వరూధిని సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలను మృతుని భార్యకు అందజేశారు. నివాళులర్పించిన వారిలో జూనియర్ అసిస్టెంట్ భరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, పలువురు నాయకులు ఉన్నారు.

నల్లబర్లీ సాగు నిషేధం

అద్దంకిటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంవత్సరం పాటు నల్లబర్లీ పొగాకు సాగు నిషేధించిందని రైతులు ఎక్కడా సాగు చేయవద్దని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ చెప్పారు. శుక్రవారం మండలంలోని మైలవరం, ఉప్పలపాడు గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లబర్లీ పొగాకు కంపెనీవారి అగ్రిమెంట్ ఉంటేనే సాగు చేసుకోవాలన్నారు. గత సంవత్సరం ధరలు లేక ఇంకా రైతులు వద్ద పొగాకు ఉందని,ఈ ఏడాది మళ్లీ సాగు చేసి ఇబ్బంది పడవద్దని సూచించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పంగులూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని, తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించవచ్చని ఏవో సుబ్బారెడ్డి చెప్పారు. మండలంలోని కొండమూరు, జనకవరం గ్రామాలలో శుక్రవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.

8, 9, 10 తేదీలలో డివిజన్ స్థాయి ఆటల పోటీలు

పంగులూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : చీరాల డివిజన్ స్థాయి ఆటల పోటీలు ఈ నెల 8, 9, 10 తేదీలలో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రతిమ చెప్పారు. ఈనెల 8వ తేదీన మార్టూరు అండర్ 14, అండర్ 17 బాల బాలికల ఖోఖో పోటీలు, అండర్ 14, అండర్ 17 బాలికల వాలీబాల్ పోటీలు మండలంలోని కోలలపూడి ఉన్నత పాఠశాలలో జరుగుతాయని తెలిపారు. ఈనెల 9వ తేదీన అండర్ 14, అండర్ 17 బాల బాలికల బ్యాడ్మింటన్ పోటీలు, అండర్ 14, అండర్ 17 బాలుర వాలీబాల్ పోటీలు వేటపాలెం మండలం పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతాయని వివరించారు. ఈనెల 10వ తేదీన అండర్ 14, అండర్ 17 బాల బాలికల కబడ్డీ పోటీలు ఇంకొల్లు జడ్‌పీ పాఠశాలలో జరుగుతాయని తెలిపారు.

అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేస్తే చర్యలు

అద్దంకి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బరాజు చెప్పారు. గతంలో తాత్కాలిక లైసెన్స్‌లు పొందిన వ్యక్తులకు చెందిన దుకాణాలు, ఇళ్లలో శుక్రవారం రాత్రి సీఐ సుబ్బరాజు పరిశీలించారు. గతంలో మిగిలిపోయిన బాణసంచాను నిల్వ ఉంచితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏవోల ప్రమోషన్‌లు.. ఇంకెప్పుడు ?!

- పదోన్నతి ఫైల్‌కు కొర్రీల మీద కొర్రీ లు

(5వ పేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉండగా, కేవలం 10 మందితో మాత్రమే జాబితా రూపొందించారు. అలా రూపొందించిన ఫైల్ ను ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు పంపటం తో ఆమె ఇదేం పద్ధతి అని అధికారులను నిలదీసినట్లు తెలుస్తున్నది. నిబంధనల ప్రకారం ఫైల్ సిద్ధం చేయాలని ఛైర్ పర్సన్ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తుంది.

సీనియర్ అసిస్టెంట్ లకు ఏఓ లుగా ప్రమోషన్ లు సకాలంలో ఇస్తే ఎంపీడీఓలు అయ్యే అవకాశం ఉంది. ఎంపీ డీఓ ల ప్రమోషన్ ప్రక్రియ మల్టీ జోనల్ కు చెందినది కాబట్టి ఉమ్మడి జిల్లా లో ప్రస్తుతం ఏఓ ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న వారికి భారీ నష్టం జరిగిందని చెప్పక తప్పదు. ఇప్పటికే మిగిలిన అన్ని జిల్లాల్లో ఏఓ ప్రమోషన్ ల ప్రక్రియ ముగిసినందున ఉమ్మడి జిల్లా లో వారు ఎంపీడీఓ లు అయ్యే అవకాశం చాలా వరకు కోల్పోయారు అని చెప్పకతప్పదు. ఎంపీ డీఓ ప్రమోషన్ కోసం సుమారు మూడేళ్ల పాటు వెనక బడినట్లే నని చెబుతున్నారు.ఇప్పటికైనా జిల్లా పరిషత్ అధికారులు స్పందించి సత్వరమే ప్రమోషన్ ఫైల్ కు మోక్షం కల్పించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సొసైటీ బ్యాంకుల్లో భోక్తలను వదిలేది లేదు

- డీసీసీబీ ఛైర్మన్ మక్కెన

(5వ పేజీ తరువాయి)

తెలిసిందన్నారు. నల్లపాడులో మిర్చి లేకున్నా ఉన్నట్లు చూపి అక్రమంగా రుణాలు పొందారని.. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరుగుతుందన్నారు. వినుకొండలో నకిలీ పాస్‌బుక్‌ల భాగోతంలో అక్రమార్కులను వదిలేది లేదన్నారు. అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేలు ధూళిపాళ్ళ నరేంద్ర, అమరనాథ్ వంటి నేతలతో హౌస్ కమిటీ వేసిందని గుర్తుచేశారు. త్వరలో హౌస్ కమిటీ గుంటూరు జిల్లా పర్యటనకు వస్తుందని తెలిపారు. అక్రమార్కుల నుంచి ప్రతి రూపాయిని రికవరీ చేస్తామని స్పష్టం చేశారు. డీసీసీబీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న నాలుగు నెలల్లో క్రాప్, సీసీ, ఎల్‌టీ రుణాలు మొత్తం రూ. 500 కోట్ల అందజేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కోల్డ్ స్టోరేజ్‌లను, గొడౌన్‌లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. పల్నాడు శావల్యాపురం పెట్రోల్ బంకులు ఇప్పటికే ఏర్పాటుచేయగా.. ఈపూరులో బంకు మంజూరు చేశామన్నారు. అలానే మెడికల్ షాపులు కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఫ్రాన్స్‌లో మంత్రి రవికుమార్

అవీఇవీ

విశాఖలో జరిగే సీఐఐ సదస్సుకు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం


పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్

అద్దంకి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీలలో జరగనున్న సీఐఐ సదస్సుకు హాజరుకావాలని పలువురు పారిశ్రామికవేత్తలను ఫ్రాన్స్‌లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలిసి ఆహ్వానించారు. గురు, శుక్రవారాలలో ఫ్రాన్స్‌లో రవికుమార్ పలు దిగ్గజ కంపెనీల అధినేతలు, ప్రతినిధులను కలసి మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అమలుచేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెజ్ విధానాలు, వివిధ పాలసీల గురించి అధికారుల బృందంతో కలిసి రవికుమార్ వివరించారు. విద్యుత్, పునరుత్పాదక రంగాలలో పెట్టుబడులకు, పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలను, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలు గురించి వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా జరుగుతున్న ఫ్రాన్స్ పర్యటన పూర్తి ఫలవంతం అవతుందని మంత్రి రవికుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వాడరేవు(చీరాల), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం చీరాల - వాడరేవు రోడ్డులోని వాకావారిపాలెం జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... వాడరేవు రెడ్డి కాలనీకి చెందిన పల్లిబోయిన బాలాజీ రెడ్డి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరడంతో ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. అవుట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

ధేనువకొండ బలరామకృష్ణాపురంలో పగలే చోరీ

10 సవర్లు బంగారం, 20 వేలు నగదు అపహరణ

అద్దంకిటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణపురంలో శుక్రవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి బంగారం, నగదు అపహరించుకుపోయారు. బాధితుల కథనం మేరకు.. కాలనీలో నివాసం ఉండే గోకతోటి పెద్ద సుబ్బయ్య తన చిన్న కుమార్తెకు ఆరోగ్యం బాగలేకపోవడంతో ఊరు వెళ్లారు. వారి పెద్ద కుమార్తె కూలీ పనులకు వెళ్లింది. కూలీ పనుల నుంచి సాయంత్రం ఇంటికి వచ్చిన పెద్ద కుమార్తె ఇంటి తలుపులు ఒక పక్క తొలగించి లోపల బీరువా పగులగొట్టి ఉండంతో వెంటనే స్థానికులను పిలిచింది. దొంగలు తలుపులు ఒక పక్క లేపి ఇంటిలోకి ప్రవేశించి బీరువాను కొడవళ్లు స్పూన్‌లు ఇతర వస్తువులతో పగల గొట్టి బంగారు గొలుసులు, ఉంగరాలు వంటివి పది సవర్లు, 20 వేల రూపాయల నగదు అపహరించుకుపోయారని కుటుంబ సభ్యులు తెలిపారు.

వెంపరాలలో కొనసాగుతున్న వైద్యశిబిరం

అద్దంకి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాలలో శుక్రవారం పారిశుధ్య పనులు, వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వెంపరాలను వెంటాడుతున్న విషజ్వరాలు అనే కథనానికి అధికారులు స్పందించి 4 రోజులుగా పారిశుధ్య కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ వెంకాయమ్మ పాల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎబేటు ద్రావణాన్ని పిచికారీ చేయించారు. మోదేపల్లి పీహెచ్‌సీ సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు, సైదులు, కన్యాకుమారి, సత్తార్, శారద పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ మండల అధ్యక్షుడు మృతి


వెంకట్రావు(ఫైల్)

సంతమాగులూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అడవిపాలేనికి చెందిన మండల టీడీపీ అధ్యక్షుడు గాడిపర్తి వెంకట్రావు(50) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వెంకట్రావు బుధవారం రాత్రి తన కారులో గుంటూరు-కర్నూలు రహదారిపై స్వగ్రామమైన అడవిపాలెం వెళుతుండగా కామేపల్లి, వెల్లల చెరువు గ్రామాల మధ్య ముందుగా వెళుతున్న దమ్ము ట్రాక్టర్‌ను తప్పించబోయి ఢీకొన్నాడు. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. తీవ్ర గాయాలైన వెంకట్రావును గుంటూరు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలిద్దరికీ వివాహమై అమెరికాలో ఉంటున్నారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఫ్యాన్స్ పర్యటనలో ఉన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఈ విషయం తెలియడంతో దిగ్భ్రాంతి చెందారు. ఈ సందర్భంగా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలను ఏకం చేసిబలోపేతం చేసేందుకు విశేష కృషి చేశారని వెంకట్రావు సేవలను మంత్రి గుర్తు చేసుకున్నారు. శుక్రవారం గొట్టిపాటి హర్షవర్ధన్‌కుమార్.. వెంకట్రావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో సారథి, పరమేశు, శ్రీనివాసరావు, మార్కెట్ తేలపోల రమేష్, చేవూరు వాసిరెడ్డి, సన్నెబోయిన ఏడుకొండలు, గురుయాదవ్, వసంత వేణు, కోటేశ్వరరావు పాల్గొన్నారు

చికిత్స పొందుతూ లారీ క్లీనరు మృతి

మార్టూరు, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు పంచాయతీ పరిధిలోని జాతీయరహదారిపై ఒంగోలు వైపు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహారాష్ట్రకు చెందిన లారీ క్లీనరు శ్రీరామ్ రాజేంద్ర గోడ్సే(25) మృతి చెందాడు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు. ఆయన మాటల్లోనే... మృతుడు మహారాష్ట్రలోని లాతూరు జిల్లాకు చెందినవాడు. నాలుగు రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయల లోడుతో విజయవాడకు వచ్చిన లారీ సరుకును లోడింగ్ చేసి, బాడుగ కోసం మార్టూరులోని ఒక లారీ ఆఫీస్‌కు ఈ నెల 1వతేదీ వచ్చారు. అదేరోజు వేకువజామున సమయంలో క్లీనరు శ్రీరామ్ రాజేంద్ర గోడ్సే రోడ్డును దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని హైవే అంబులెన్స్ వారు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శుక్రవారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం

మార్టూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మార్టూరులో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి అమ్మ వారి పంచలోహ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టరుపై ఉంచి భక్తులు ఊరేగించారు. అదేవిధంగా జొన్నతాళి గ్రామంలో అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. దాదాపుగా లక్ష రూపాయలకు పైగా విలువగలిగిన అమ్మ వారి ప్రతిమను తీసుకువచ్చి ఉత్సవాలను నిర్వహించారు. తరువాత అమ్మ వారి ప్రతిమను చెరువులో నిమజ్జనం చేశారు. నాగరాజుపల్లిలోని శ్రీగంగా పార్వతీ సమేత నాగలింగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక హారతులతో అమ్మ వారి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు.


జొన్నతాళిలో జరిగిన అమ్మ వారి గ్రామోత్సవం


సంతరావూరులో లక్ష్మీచెన్నకేశవస్వామి

చీరాలలో పార్వేట ఉత్సవం

చీరాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసర దేవీ నవరాత్రులు సందర్భంగా ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్లో నిర్వహించిన పార్వేట ఉత్సవంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అన్ని ఆలయాల్లోని ఉత్సవ మూర్తులను పార్వేటలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చినగంజాం మండలంలో...

చినగంజాం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : దేవి శరన్నవరాత్రులు వైభవంగా ముగిశాయి. గురువారం వేకువజామున నుంచే ఆలయాల్లో అమ్మవార్లకు పట్టు వస్త్రధారణ, ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కడవకుదురు గ్రామంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి విగ్రహాలను శరన్నవరాత్రులు అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఉంచి డీజే సౌండ్‌లు, బాణసంచాల ఊరేగించి మోటుపల్లి తీరంలోని గంగమ్మ ఒడికి చేర్చారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి, సోపిరాల రామకోటేశ్వరస్వామి ఆలయంలో లలితాపరమేశ్వరి అమ్మవారి శరన్నవ రాత్రులు ముగింపు రోజు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శమీ పూజ నిర్వహించారు. తదనంతరం అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. సంతరావూరు గ్రామంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామికి విశేష పూజలతోపాటు గ్రామోత్సవం చేశారు.

ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోండి

ఇంకొల్లు, అక్టోబరు 3,(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలలో తెచ్చిన మార్పులతో తగ్గనున్న విద్యుత్ చార్జీలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని ఆ శాఖ కమిషనర్ జి.ఆంజనేయులు చెప్పారు. నూతన జీఎస్టీ విధానంతో విద్యుత్‌శాఖలో ఎంతో అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఇంకొల్లులో సూపర్ జీఎస్టీ సేవింగ్స్ కరపత్రాలను విద్యుత్‌శాఖ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొణికిలో నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. గ్రామాలలో లోఓల్టేజి సమస్య తలెత్తకుండా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లికార్జునరావు, శ్రీనివాసులు, ఇంకొల్లు ఏఈ జాగర్లమూడి రామకృష్ణ పాల్గొన్నారు.


పర్చూరులో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటస్వామి

జీఎస్టీపై అవగాహన తప్పనిసరి

చినగంజాం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో కె.ధనలక్ష్మి చెప్పారు. మండలంలోని గొనసపూడి గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై శుక్రవారం అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులు గ్రామంలో ట్రాక్టర్లతో జీఎస్టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావూరి శారద, వీవోఏ రమ్య గ్రామ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

పర్చూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.వెంకటస్వామి చెప్పారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జీఎస్టీపై అవగాహన కల్పించటానికి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు నెలకు రూ.1200 నుంచి 1500 వరకు ఖర్చు భారం తగ్గుతుందన్నారు. తగ్గిన జీఎస్టీ ఫలాలు సక్రమంగా అందాలంటే షాపుల్లో కొనుగోలు చేసిన వస్తువులకు విధిగా బిల్లులు తీసుకోవాలన్నారు. అనంతరం తగ్గిన జీఎస్టీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి మస్తాన్‌రావు పాల్గొన్నారు.

లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీంపై అవగాహన కల్పించాలి

మార్టూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన లేఅవుట్‌లను రెగ్యులరైజేషన్ చేసుకోవడంపై, ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంపై వారికి అవగాహన కలిగించాలని ఒడా ఒంగోలు జేపీవో శారద చెప్పారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీంపై మార్టూరు, బల్లికురవ, యద్దనపూడి, కొరిశపాడు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో జేపీవో మాట్లాడుతూ 2025 జూన్ నెలకు ముందు అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తద్వారా తక్కువ ఖర్చుతో వారు వేసిన వెంచర్లను రెగ్యులరైజేషన్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. ఈ విషయంపై వారి గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, స్థల యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒడా అధికారులు షఫీ, మధు, మార్టూరు పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉడా ఒంగోలు జేపీవో శారద

నీట మునిగిన సర్వీస్ రోడ్డుతో రాకపోకలకు ఇబ్బంది

పంగులూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం ప్రధాన కూడలిలోని సర్వీస్ రోడ్డు నీటితో నిండి కుంటను తలపిస్తోంది. కొద్దిపాటి వర్షానికే నీటమునుగుతున్న సర్వీస్ రోడ్డుపై రాకపోకలు సాగించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 16వ నెంబరు జాతీయరహదారిపై ముప్పవరం ప్రధాన కూడలిలో ఫ్లైఓవర్ పక్కన సర్వీస్‌రోడ్డులో నెలకొన్న ఈ దుస్థితితో ముప్పవరంతో పాటు పరిసర గ్రామ ప్రజలు, ఉన్నత పాఠశాలకు చేరుకునే విద్యార్థులు, పంట పొలాలకు వెళ్లే రైతులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. వర్షపునీరు సర్వీస్ రోడ్డును ముంచెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


చెరువును తలపిస్తున్న ముప్పవరం ప్రధానకూడలిలోని సర్వీస్‌రోడ్డు

పెత్తందారులతో ప్రజలకు అశాంతి

చీరాలలో రిటైర్డ్ ఐఏఎస్ విజయ్‌కుమార్ సమావేశం

చీరాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెత్తందారుల పెత్తనంతో ప్రజలు అశాంతితో ఉన్నట్లు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ చెప్పారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో గ్రామ స్వరాజ్యమా.. పెత్తందారీ స్వామ్యమా అను అంశంపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చుండూరు వాసు, దామర్ల శ్రీకృష్ణ, గవిని శ్రీను, మోహనకుమార ధర్మ, బత్తుల శామ్యేల్, ఊటుకూరి వెంకటేశ్వర్లు, శీలం రవి పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేస్తేనే చిరకాలం గుర్తింపు

పంగులూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయవృత్తిలో ఉత్తమ సేవలందించిన వారిని ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కంకణాల శ్రీనివాసరావు చెప్పారు. పంగులూరులోని ఆదర్శ పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన నూకతోటి జ్యోతిర్మయిబాబు సేవలను కొనియాడుతూ పలువురు అధికారులు, ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో నాగభూషణం, వీరాంజనేయులు, చిలుకూరి శ్రీనివాసరావు, గుర్రం ప్రసాద్, సోమేపల్లి శ్రీనివాసరావు, నారాయణ, ఆర్‌వీ సుబ్బారావు, జయమ్మ, రామారావు, జయమ్మ, లలిత, చెంచురామారావు, రహంతుల్లా, వెంకటరావు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీకి బీరువా అందజేత

అద్దంకిటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎంఆర్‌సీ కార్యాలయానికి మండలంలోని తిమ్మాయపాలెం ప్రాథమిక పాఠశాల (హెచ్)లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మలాది కోటేశ్వరరావు 8 వేల రూపాయలు విలువైన బీరువాను శుక్రవారం ఎంఈవో కేవీ శ్రీనివాసరావు అందజేశారు.

అవీఇవీ

డీటీఆర్ ఏర్పాటుతో విద్యుత్ అక్రమ వాడకానికి చెక్


డీటీఆర్ మిషన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పర్చూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) ఏర్పాటుతో విద్యుత్ అక్రమ వినియోగానికి చెక్ పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పర్చూరులోని పలు ట్రాన్స్ ఫార్మర్లకు శుక్రవారం ఆ శాఖ అధికారులు డీటీఆర్ ఏర్పాటు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డీటీఆర్ మిషన్ ద్వారా ఎంత విద్యుత్ వినియోగం అవుతుందన్న పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

బల్లికురవ-మార్టూరు రోడ్డులో గోతులను పూడ్చిస్తున్న టీడీపీ నాయకులు


గోతులను పూడ్చిస్తున్న హనుమంతురావు

బల్లికురవ, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి) : అధ్వానస్థితికి చేరిన అర్ అండ్‌బీ రోడ్డులో తాత్కాలికంగా గోతులను పూడ్చించే పనులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. బల్లికురవ-మార్టూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో నాలుగు కిలో మీటర్ల మేరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డులో భారీ వాహనాల వలన వచ్చే దుమ్ముతో తాము ఉండలేకపోతున్నామని నక్కబొక్కలపాడుకు చెందిన ప్రజలు రెండు రోజుల క్రితం ఆందోళనకు దిగారు. రోడ్డు సరిచేసే వరకు తమ గ్రామంలోకి భారీ గ్రానైట్ వాహనాలు వద్దు అంటు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో రోడ్డులో ఉన్న పెద్ద పెద్ద గోతులను నక్కబొక్కలపాడుకు చెందిన మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతరావు యంత్రంతో పూడ్చిస్తున్నారు. గోతులు కొంత మేర పూడ్చి దుమ్ము లేవకుండా ట్యాంకర్ల ద్వారా రోడ్డు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే వరకు నీటిని చల్లిస్తామని ఈసందర్భంగా ఆయన తెలిపారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ


భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బల్లికురవ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో అభయాంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు గురువారం భూమి పూజ కార్యక్రమం జరిగింది. గ్రామంలోని సాయిబాబా దేవాలయానికి సమీపంలో 11 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు భక్తులు ముందుకు వచ్చారు. గ్రామంలోని మహిళా భక్తులు భూమి పూజలో పాల్గొన్నారు.

వైసీపీ సీఈసీ సభ్యుడిగా అమృతపాణి

చీరాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టరు వరికూటి అమృతపాణిని నియమిస్తూ పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. అమృతపాణి సుదీర్ఘ కాలంగా చీరాల పట్టణంలో అమ్మ హాస్పిటల్ నిర్వహిస్తూ వైసీపీ రాష్ట్ర నాయకులుగా పని చేస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం పలువురు వేమూరు నియోజకవర్గానికి చెందిన వైసీపీ శ్రేణులు అమృతపాణిని ఘనంగా సత్కరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మేదరమెట్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న బైపాస్‌లో మండలంలోని యర్రబాలేనికి చెందిన చల్ల శ్రీనివాసులు టీవీఎస్ మోపెడ్‌పై మేదరమెట్ల వస్తుండగా ఒంగోలు వైపు నుంచి వస్తున్న మరో బైకిస్ట్ శ్రీనివాసులు వెనుక నుండి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రెండు వాహనాలపై ఉన్న ముగ్గురికి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అలాగే బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని తిమ్మనపాలెం సమీపంలోని జాతీయ రహదారిలో అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన జాషువా అనే వ్యక్తి తన మనుమడు, మనుమరాలితో బైక్‌పై ఒంగోలు వెళ్తుండగా తిమ్మనపాలెం సమీపంలో వ్యతిరేక దిశలో వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జాషువాకు గాయాలు కాగా 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదాలపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి


వెంకట సుబ్బారావు మృతదేహం



లక్ష్మి మృతదేహం

మేదరమెట్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం వెంకటాపురం జాతీయ రహదారిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పంగులూరు మండలం అలవలపాడుకు చెందిన కొత్తూరి వెంకటసుబ్బారావు(55), భార్య లక్ష్మి(50) బైక్‌పై ఒంగోలు నుంచి వస్తూ అలవలపాడు రోడ్డుకు వెళ్లేందుకు మలుపు తిరుగుతున్నారు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి ఏలూరు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలాన్ని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ మహమ్మద్ రఫీలు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్, కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : నామ్ రోడ్డును క్రాస్ చేస్తున్న ట్రాక్టర్‌ను కారు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న సాయిరామ్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... మండలంలోని బలరామకృష్ణాపురం వద్ద నామ్ రోడ్డును ట్రాక్టర్ క్రాస్ చేస్తున్న సమయంలో అద్దంకి వైపు నుంచి ఒంగోలు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒంగోలుకు చెందిన సాయిరామ్‌కు గాయాలయ్యాయి. అతనిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వర్షాకాలం వస్తే నెల్లూరులో దోమల దెబ్బ ఎలా ఉంటుందో నగరవాసులందరికీ అనుభవమే. కార్పొరేషన్ ఎన్ని నివారణ చర్యలు తీసుకున్నా దోమలు మాత్రం తగ్గనంటున్నాయి. ఈ పరిస్థితులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం.. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లలో దోమల నివారణకు సరికొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీను ఉపయోగించేలా నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి విధివిధానాలను జారీ చేసింది. ఈ ఏఐ టెక్నాలజీని నెల్లూరులోనూ ప్రవేశపెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.



- నెల్లూరులో వినూత్న ప్రయోగానికి శ్రీకారం
- ఏఐ టెక్నాలజీతో డ్రోన్ల ద్వారా నగరంలో సర్వే
- దోమల పునరుత్పత్తి ప్రాంతాల గుర్తింపు
- డ్రోన్ల ద్వారానే నివారణ లిక్విడ్ స్ప్రే
- ఫాగింగ్ యంత్రాలకూ జీపీఎస్
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం



దోమలపై ఏఐ ఫోకస్!

నెల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటివరకూ దోమల నివారణకు వీధుల్లో ఫాగింగ్ చేయడం, కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయడం జరుగుతుండేది. ఇందుకోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పూర్తిస్థాయిలో దోమల నివారణ సాధ్యపడటం లేదు. అందుకు ప్రధాన కారణం ఖాళీ స్థలాలు, మురుగు ప్రాంతాలు. వీధుల్లోనూ, కాలువల్లోనూ కార్పొరేషన్ సిబ్బంది నివారణ చర్యలు చేపడుతున్నా రిమోట్ ప్రాంతాల్లోకి వీరు వెళ్లే పరిస్థితి లేకుండా ఉంది. ఇటువంటి ప్రాంతాలు దోమల పునరుత్పత్తికి ఆవాసాలుగా మారుతున్నాయి. వీటిని నేరుగా గుర్తించడం కూడా సిబ్బందికి కష్టంగా ఉంటోంది. ఈ క్రమంలో 'ఏఐ బేస్ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్' తీసుకొచ్చారు. ఇందులో డ్రోన్ల ద్వారా నగరం మొత్తం పరిశీలిస్తారు. ఎక్కడెక్కడ ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉంటోంది? ఎక్కడ దోమల పునరుత్పత్తి జరుగుతోంది? వంటి ప్రాంతాలను గుర్తిస్తారు. మనుషులు వెళ్లలేని ప్రాం తాలకు డ్రోన్లను పంపుతారు. ఈ డ్రోన్ల ద్వారా ఫాగింగ్ చేస్తారు. అలానే ఇటువంటి ప్రాంతాలన్నిటినీ సర్వేలెన్స్‌లో ఉంచుతారు. ఒకసారి ఫాగింగ్ చేసి వదిలేయడం కాకుండా నిరంతరం మానిటరింగ్ చేస్తూ దోమల నివారణకు చర్యలు చేపడతారు. డ్రోన్లకు జీపీఎస్‌ను అమర్చి కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తారు. అక్కడ నుంచే అధికారులు నేరుగా పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

● ఫాగింగ్ యంత్రాలకూ జీపీఎస్

ఇక రెగ్యులర్‌గా జరుగుతున్న ఫాగింగ్ ప్రక్రియలో కూడా మార్పులు తీసుకురాబోతున్నారు. కొందరు సిబ్బంది తూతూమంత్రంగా ఫాగింగ్ చేసి మమ అనిపిస్తున్నారు. దోమల నివారణ జరగకపోవడానికి ఇది కూడా ఒక కారణంగా అధికారులు గుర్తించారు. తమ ప్రాంతాల్లో ఫాగింగ్ చేయడం లేదంటూ తరచూ ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ సమస్యకు కూడా చెక్ పెడుతూ ఫాగింగ్ యంత్రాలకు కూడా జీపీఎస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. నెల్లూరు కార్పొరేషన్ వద్ద 50 ఫాగింగ్ యంత్రాలు ఉండగా, తొలుత 10 యంత్రాలకు జీపీఎస్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ జీపీఎస్‌లు అన్నింటినీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తారు. అక్కడనుంచి అధికారులు ఫాగింగ్ ఎలా జరుగుతోందన్నది పర్యవేక్షిస్తారు. ఈ కొత్త టెక్నాలజీ కోసం దాదాపు రూ.40 లక్షలను ఖర్చు చేయనున్నారు.



జాతిపితకు ఘన నివాళి

జాతిపిత మహాత్మా గాంధీజీకి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన నివాళులర్పించారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా నెల్లూరులోని కలెక్టరేట్, గాంధీబొమ్మ వద్ద విగ్రహాలకు నివాళులర్పించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ, స్వచ్ఛంద తదితర కార్యాలయాల్లోనూ గాంధీ చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించి, ఆయన సేవలను కొనియాడారు.

17,406 మందికి 'ఆటోడ్రైవర్ల సేవలో'

● నేడు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ



నెల్లూరు (క్రైం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. ఆటోడ్రైవర్లకు లబ్ధి చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా ప్రతి డ్రైవర్‌కు రూ.15వేలు చొప్పున ప్రతి ఏడాది అందజేయనున్నారు. ఈ మేరకు ఆటోడ్రైవర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించిన అధికారులు తుదిజాబితాను వెల్లడించారు. జిల్లాలో ఈ పథకానికి 17,406 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. శనివారం వీరందరి ఖాతాల్లో నగదు జమకానుంది. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో కూటమి నాయకులు, అధికారులు 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభించనున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఆటోల ర్యాలీలో పాల్గొననున్నారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాది 16,516 మందికి మాత్రమే వాహనమిత్ర పేరుతో రూ.10వేలు చొప్పున నగదు జమ చేసింది. ప్రస్తుత ప్రభుత్వంలో లబ్ధిదారుల సంఖ్య పెరగడంతోపాటు వారికి ఇచ్చే నగదు కూడా పెరగడం విశేషం.

నియోజకవర్గం	లబ్ధిదారులు
నెల్లూరు రూరల్	3441
సర్వేపల్లి	2651
కోవూరు	2585
కావలి	1888
నెల్లూరు అర్బన్	1821
ఆత్మకూరు	1636
ఉదయగిరి	1406
కందుకూరు	1004
వెంకటగిరి (3 మండలాలు)	974



సంగంలో రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చిన కామాక్షిదేవి



దసరా సెలవులు ముగియడంతో శుక్రవారం నెల్లూరు బస్టాండులో రద్దీ

సంబరంగా దసరా

● కన్నుల పండువగా నగరోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగను గురువారం జిల్లావ్యాప్తంగా ప్రజలు సంబరంగా జరుపుకున్నారు. ఆలయాల్లో విజయదశమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం అభిషేకాలు, విశేష నవావరణపూజలు జరిగాయి. సాయంత్రం శమీపూజ, పారువేట ఉత్సవాలు జరిగాయి. విద్యుద్దీపాలు, విశేష పుష్పాలంకరణ, బాణాసంచా, మంగళ వాయిద్యాలతో నగరోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. నెల్లూరులో రాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి, కన్యకాపరమేశ్వరి, బుచ్చిరెడ్డిపాళెం మండలంలో జొన్నవాడ కామాక్షితాయి, రాపూరు మండలం పెంచలకోన, నెల్లూరు రూరల్ మండలం నరసింహులకొండ, కావలి కలుగోళమ్మ తదితర ప్రముఖ ఆలయాల్లో విజయదశమి ఉత్సవాలు ఘనంగా చేశారు. అమ్మవారి నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయం, వాణిజ్య దుకాణాల్లో ఆయుధ పూజలు కూడా జరిగాయి.



నెల్లూరు : రాజరాజేశ్వరి ఆలయంలో భక్తుల సందడి



నెల్లూరు : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర.. జిల్లాకు రెండు రాష్ట్రస్థాయి అవార్డులు

● జిల్లాస్థాయిలో 48 అవార్డులు : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద పరిశుభ్రత రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు రాష్ట్రస్థాయిలో జిల్లాకు రెండు, జిల్లాస్థాయిలో 48 అవార్డులు వచ్చాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి అవార్డు గ్రహీతలను ఈ నెల 6న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానిస్తారని తెలిపారు. ఇక రాష్ట్రస్థాయిలో ఆత్మకూరు మున్సిపాలిటీ, స్వచ్ఛత వారీయర్‌గా పద్మావతి ఎంపికవగా, ఈ నెల 6న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ఈ అవార్డులను అందుకోనున్నారు.

● ఆత్మకూరుకు అరుదైన ఘనత



ఆత్మకూరు : పరిశుభ్రత, పారిశుధ్యం, అభివృద్ధి చర్యల్లో ప్రతిభ కనబరిచిన ఆత్మకూరు మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. ఇంటింటా వ్యర్థాల సేకరణ, తడి, పొడి చెత్త వేరు చేయడం, తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీ, డ్రైవేస్ట్(ఎంఆర్ఎఫ్) ప్రాసెసింగ్, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వహణ, మెప్మా ద్వారా మిద్దెతోటలను ప్రోత్సహించడం, మొక్కల పెంపకం, లెగసీ వేస్ట్ క్లియరింగ్ తదితర కేటగిరిల్లో 50 వేలు లోపు జనభా కలిగిన మున్సిపాలిటీల్లో ఆత్మకూరు ముందంజలో నిలిచింది. 23 వార్డులు, 32,556 మందికి పైబడి ఉన్న ఆత్మకూరులో 63 కి.మీ పొడవున పక్కా డ్రైన్, 48 కి.మీ ఖచ్చా డ్రై ఉన్నాయి. ఇటీవల వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, ప్రజా అవగాహన ద్వారా ఆత్మకూరు మున్సిపాలిటీ పురోగతిని సాధించింది. ఆత్మకూరుకు ఈ అవార్డు దక్కడంపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● స్వచ్ఛతా వారీయర్‌గా పద్మావతి



నెల్లూరు (సిటీ) : స్వచ్ఛతా వారీయర్‌గా 45వ డివిజన్‌కు చెందిన పారిశుధ్య కార్మికురాలు తాటిపర్తి పద్మావతిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. గత నెల 17వ తేదీ నుంచి వరుసగా స్వచ్ఛతహీ సేవ కార్యక్రమాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా పురపాలక శాఖ నిర్వహించింది. ఇందులో భాగంగా స్వచ్ఛత వారీయర్‌గా పద్మావతిని ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతిలో సీఎం చేతుమీదుగా అవార్డును అందుకోనున్నారు.

4 రోజులు.. రూ.30 కోట్లు

● పండుగ రోజుల్లో భారీగా మద్యం అమ్మకాలు

తేదీ	ఐఎంఎల్ (కేసులు)	బీర్లు (కేసులు)	ధర (రూ.లలో
29-9-25	15058	5835	10.95కోట్లు
30-9-25	14499	4792	10.23కోట్లు
1-10-25	2801	1067	2.04కోట్లు
మొత్తం	32358	11696	23.22కోట్లు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ రోజుల్లో జిల్లావ్యాప్తంగా మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. పండుగ రోజు గాంధీ జయంతి రావడంతో బార్లు, మద్యం దుకాణాలు మూత పడినా ముందు రోజే మందుబాబులు మద్యం కొనుగోలు చేయడం, బ్లాక్‌లో మద్యం అమ్మకాలు సాగడంతో పండుగ రోజుల్లో మద్యం ఏరులై పారింది. సహజంగా జిల్లాలో రోజుకు సుమారు రూ.4 కోట్ల మద్యం స్టాక్ డిపో నుంచి మద్యం దుకాణాలు, బార్లకు వెళుతుంది. అయితే గత నెల 29 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు రూ.23.22 కోట్ల మద్యం డిపో నుంచి బయటకు వచ్చిందని అధికారులు తెలుపుతున్నారు. ఇక మంగళవారం ఒక్కరోజే సుమారు రూ.7 కోట్లకుపైగా మద్యం డిపో నుంచి బయటకు వచ్చినట్లు సమాచారం. మొత్తం మీద గత నెల 29 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు సుమారు రూ.30 కోట్ల మద్యం డిపో నుంచి బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది.

ఆవేశంలో హత్యలు

- కన్న కొడుకునే రోకలి బండతో కొట్టిన కసాయి తండ్రి
- తల్లిని కొట్టొద్దన్నందుకు ముదివర్తిలో దారుణం!
- పాతకక్షలతో దారకానిపాడులో యువకుడు..
- కారుతో బైక్‌ను బలంగా ఢీకొట్టి ఘాతుకం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆవేశం రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. భార్యను కొడుతుంటే అడ్డొస్తున్నాడని కన్న కొడుకునే దారుణంగా హత్య చేశాడో కసాయి తండ్రి. పాత కక్షలను మనసులో పెట్టుకుని బైక్‌పై వెళుతున్న యువకుడిని కారుతో బలంగా ఢీకొట్టి అతని మరణానికి కారణమయ్యాడు ఇంకో కఠినాత్ముడు. విడవలూరు మండలం ముదివర్తి, గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామాల్లో జరిగిన ఈ దారుణాలు ఆయా పల్లెల్లో విషాదాన్ని నింపాయి.

- వివరాలు 8లో...

ఈ భావి వైద్యురాలికి

ఏ కష్టమొచ్చింది!?

● ప్రభుత్వ వైద్యకళాశాలలో వైద్యవిద్యార్థిని ఆత్మహత్య



దసరా సెలవుల్లో స్నేహితురాలితో సరదాగా గడిపింది. ఆ తర్వాత సొంతూరులో తల్లిదండ్రులతోనూ ఆనందం పంచుకుంది. ప్రాక్టికల్స్ పరీక్షల కోసం పండుగ నాడే నెల్లూరుకు చేరుకుంది. పరీక్షలకు ముందు కూడా హాస్టల్ గదిలో స్నేహితురాలితో నవ్వుతో మాట్లాడింది. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో... ఆ భావి వైద్యురాలికి ఏ కష్టమొచ్చిందో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం జరిగిన ఈ ఘటన వైద్య విద్యార్థులు, మృతురాలి బంధువుల్లో తీవ్ర విషాదం నింపింది.

- వివరాలు 8లో...

భాషా పండితులకు ఊరట

● న్యాయస్థానం ఆదేశాలతో ఉద్యోగోన్నతులు



పండిట్‌లకు ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందిస్తున్న డీఈఓ బాలాజీరావు

నెల్లూరు (విద్య), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల పోరాట ఫలితం, న్యాయస్థానం ఆదేశాలతో జిల్లాలో పండిట్‌లకు ఉద్యోగోన్నతులు కల్పించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఉన్న భాషోపాధ్యాయులకు (తెలుగు, హిందీ, ఉర్దూ) 2019లో ఉన్నతీకరణ జరిగింది. 2017లో ఇచ్చిన జీఓ నెం 91ను గత వైసీపీ ప్రభుత్వం పక్కనపెట్టి జీఓ నెం 77ను ప్రవేశ పెట్టింది. దీంతో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పదోన్నతి పొందగా అర్హులైన భాషా పండితులు అవకాశాన్ని కోల్పోవడంతోపాటు ఎల్‌పీ కేడర్ లేకుండా పోయింది. భాషాపండితులను డీఈఓ పూల్ కింద పరిగణించి వర్క్ అగ్రెస్ట్ వేతనాలతో విధులు కేటాయిస్తున్నారు. దీంతో జిల్లాలో భాషోపాధ్యాయుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. 2019లో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పదోన్నతులు వీరికి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ప్రస్తుతం జిల్లాలో జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 71 మంది తెలుగు, ఏడుగురు హిందీ, ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో ఏడుగురు హిందీ పండిట్‌లు ఉన్నారు. అయితే సాధారణ ఉపాధ్యాయుడికి ఒకసారి బదిలీ అయితే జిల్లాలో ఏదైనా పాఠశాలలో కనీసం 8 ఏళ్ల పనిచేసేందుకు అవకాశం ఉంటుంది. డీఈఓ పూల్‌లో ఉన్న భాషోపాధ్యాయులకు మాత్రం బదిలీలు జరిగిన ప్రతిసారీ బదిలీలకు గురవుతున్నారు. దీనిపై గత ప్రభుత్వంలో భాషా పండితులు న్యాయస్థానాలను ఆశ్రయించగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వీరికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

● 85 మందికి ఉద్యోగోన్నతులు

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు 87 మంది భాషా పండిట్‌లలో 85 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ డీఈఓ బాలాజీరావు ఉత్తర్వులు జారీ చేశారు.

కరెంటు బిల్లులోనే 'ట్రూఆప్' తగ్గింపు

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నవంబరు నెల నుంచి కరెంటు బిల్లులోనే ట్రూ డౌన్ చార్జెస్ జమ అవుతాయని విద్యుత్ శాఖ ఎస్ఈ కే రాఘవేంద్రం తెలిపారు. విద్యుత్ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ట్రూఆప్ చార్జీలు తగ్గించడం వల్ల 32.24 కోట్ల రుపాయలు వినియోగదారులకు అందుతుందన్నారు.

'సోమశిల'కు 25,205 క్యూసెక్కుల వరద

అనంతసాగరం అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 25,205 క్యూసెక్కుల వరద కొనసాగింది. దీంతో డ్యాంలో 72.965 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 22,800, ఉత్తర కాలువకు 100, కండలేరుకు 4వేల క్యూసెక్కు నీటిని సరఫరా చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	133
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 525

విధుల నుంచి క్షేత్ర సహాయకుడి తొలగింపు

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ పంచాయతీలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడిగా పని చేస్తున్న హరికృష్ణను విధుల నుంచి తొలగిస్తూ డ్వామా పీడీ గంగాభవాని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో చెంచమ్మ శుక్రవారం తెలిపారు. నర్రవాడ పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుడిగా చేరిన హరికృష్ణ తన బంధువులు, గ్రామంలో లేని వారి పేర్లతో మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశారని జిల్లా అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు జూన్ నెలలో క్షేత్ర సహాయకుడిపై డ్వామా అధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు నిధులు స్వాహా చేసింది వాస్తవమేనని పీడీకి నివేదిక అందించారు. దీంతో అతడిని విధుల నుంచి తొలగించడంతోపాటు స్వాహా చేసిన రూ.2.56 లక్షల నిధులను రికవరీ చేయడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ఆదేశాలు అందినట్లు ఎంపీడీవో తెలిపారు.

న్యూస్ బాక్స్



మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

మహాత్మాగాంధీకి ఘన నివాళి

లింగసముద్రం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని లింగసముద్రంలోని ఆయన విగ్రహానికి పలువురు టీడీపీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, టీడీపీ నేతలు అడపా రంగయ్య, అడపా కోటయ్య, భట్టరుశెట్టి రమణయ్య, జి బాలనారాయణ, కిలారి యశ్వంత్, షేక్ పరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీరోడ్డులో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున విద్యుత్ లైన్లు మార్పుకోసం శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎమ్మార్వో ఆఫీసు ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈఈ టీవీ నరసింహం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని సుల్తాన్‌మొహిద్దీన్ హాస్పటల్ ఏరియా, సంతోష్‌నగర్, మక్కా మసీదు ఏరియా, ఎమ్మార్వో ఆఫీసు ఏరియా, బూడిదపాలెం, పాత బ్యాంకు బజారు, కోటకట్ట వీధి, అన్నా క్యాంటీన్, పెద్దబజారు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

కావలిలో...

కావలి,అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉత్తర శివార్లలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఒకటో పట్టణ విద్యుత్ శాఖ ఏఈ నాగార్జున శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాతూరు, గాయత్రీనగర్, వేపకాయల మిల్లు తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

'ఉపాధి' పనులు గుర్తించాలి

ఉలవపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాబోవు ఆర్థిక సంవత్సరానికిగాను గ్రామంలోని ఉపాధి పనులను గుర్తించాలని ఏపీవో అబ్దుల్లా కోరారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచు నాగలక్ష్మీ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి 68,000 పనిదినాలు కల్పించేలా చెరువులు, గుంతలు, పంట కాలువలు గుర్తించాలని ఏపీవో సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు కల్పించే విధంగా పనులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరయ్య, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రారంభం

జలదంకి, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం చోడవరంలో భూముల రీసర్వే శుక్రవారం ప్రారంభమైంది. గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయంలో తహసీల్దారు ప్రమీల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. మొత్తం 3700 ఎకరాలు రీసర్వే చేయనున్నామని, 60 రోజుల వ్యవధిలో మొత్తం సర్వే చేసి హద్దులు గుర్తిస్తామని తహసీల్దారు తెలిపారు. భూహక్కుదారులు తమ పత్రాలు సర్వే బృందానికి ఇచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు శోభన్, గ్రామస్తులు జాజుల శివరామయ్య, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శింగపేటలో...



మాట్లాడుతున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

అల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరు మండలం శింగపేటలో భూరీసర్వే కార్యక్రమం నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ శుక్రవారం శింగపేటలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ 60 రోజులపాటు శింగపేటలో భూ రీసర్వే కొనసాగుతుందన్నారు. రైతులు అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ నరసింహమూర్తి, డీటీ ప్రవీణ్‌కుమార్, సర్వేయరు అశోక్, ఆర్ఐ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయ జీర్ణోద్ధరణకు 6వతేదీ భూమి పూజ

కలిగిరి, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణంపై శుక్రవారం గ్రామపెద్దలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సోమవారం ఆలయ నిర్మాణానికి సంబంధించి భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టి, త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేయటానికి అందరూ సహకరించాలని కోరారు.

ఘనంగా దసరా సంబరాలు

కందుకూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినాన్ని గురువారం కందుకూరు పట్టణ, పరిసర ప్రాంతాలలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకమ్మ దేవాలయం, కోవూరు రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులు అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని జనార్థనస్వామి ఆలయం, కోదండ రామాలయం, సోమేశ్వరాలయాల్లో ప్రజలు పెద్దసంఖ్యలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. గురువారం రాత్రి అంకమ్మ ఆలయ ప్రాంగణంలో పార్వేట మహోత్సవం కన్నులపండుగగా జరిగింది. గ్రామంలోని వివిధ ఆలయాల ఉత్సవమూర్తులు గ్రామోత్సవంగా అంకమ్మ దేవాలయానికి చేరుకుని కొలువుదీరగా భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పార్వేట ఉత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

● ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

లింగసముద్రం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినపవని గ్రామంలోని పావన క్షేత్రం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా మహా సుదర్శన హోమం, స్వామి వారికి చక్రస్నానం, నిత్యహోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి దేవతామూర్తులకు పూజలు చేశారు. సాయంత్రం స్వామి వార్లకు గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా విజయదశమి

కొండాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పండుగను గురువారం మండలపరిధిలోని పలు గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. సాయిపేట పంచాయతీలోని మక్కెనవారిపాలెం గంగమ్మ గుడివద్ద భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపాలెం గ్రామంలో మహాలక్ష్మమ్మ గుడివద్ద ప్రత్యేకపూజలతో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



గౌరీదేవి అలంకారంలో దుర్గాభ్రమరాంబ అమ్మవారు

● సముద్రతీరంలో అమ్మవార్ల నిమజ్జనం

కావలి రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ గ్రామాన ఉన్న అమ్మవారి ఆలయాల్లో విజయదశమి సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి శుక్రవారం అమ్మవార్లను సముద్ర తీరానికి తరలించి నిమజ్జనం చేశారు. అమ్మవారి మాలధారణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద చిన్నారుల చే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వైకుంఠపురం గాంధీ వీధిలో చల్లా దుర్గాదేవి అమ్మవారిని ప్రత్యేక పూజల అనంతరం తుమ్మలపెంట తీరంలో నిమజ్జనం చేశారు. గుంజి ప్రసన్నకుమార్, కిరణ్, రాంబాబు, ఈగలపాటి సుభాషిణి, విజయమ్మ, పద్మ, శివ పాల్గొన్నారు.

అల్లూరు: అల్లూరు మండలంలో విజయదశమి ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. నార్త్‌మోపూరు పర్వవతవర్ధినిదేవి ఆలయంలో అమ్మవారు ఉమామహేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అల్లూరులోని పార్వతిదేవి ఆలయంలో నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలు మండలంలో శరన్నవరాత్రుల చివరిరోజు గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ఆలయాల్లో రాజరాజేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వనాథరావుపేట కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవిని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బోగోలు షిరిడి సాయిబాబా మందిరం, రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వస్వామి, జువ్వలదిన్నె శివాలయం, నాగులవరం గంగాపార్వతి సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



కందుకూరు : పార్వేట ఉత్సవంలో ఎమ్మెల్యే ఇంటూరి, భక్తులు



కావలి రూరల్ : అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



లింగసముద్రం : చినపవనిలో గ్రామోత్సవంలో గరుడ వాహనం మీద ఉభయదేవేరులతో ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

కావలి (టౌన్): అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామ దేవత కలుగోళశాంభవీ అమ్మవారు కలుగోళశాంభవీ అలంకారంలో దర్శనమివ్వగా, రాత్రి గజవాహన సేవలందుకున్నారు. శివాలయంలో దుర్గాభ్రమరాంబ అమ్మవారు గౌరీదేవి అలంకారంలో దర్శనమివ్వగా సాయంత్రం శాంతి కల్యాణం జరిగింది. విష్ణు ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో, వడ్డిపాలెంలోని కనకదుర్గా అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ట్రంకురోడ్డు బృందావనం కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి.

అర్హత ఉన్న ప్రతీ ఆటో డ్రైవరుకు ప్రభుత్వ సాయం

కావలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతీ ఆటోడ్రైవరుకు ప్రభుత్వం అందించే రూ. 15 వేల సాయం అందేలా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులతో ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో 1888 మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున శనివారం రూ. 2.83 కోట్లు అందచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంకు సంఘీబావం తెలుపుతూ ఆటో డ్రైవర్లు ముసునూరులోని ఎమ్మెల్యే నివాసం నుంచి మద్దూరుపాడులోని ఎస్ఎంకే కన్వెన్షన్ హాలు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్ల సమస్యలపై చర్చించి అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సాయం అందేలా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆటో డ్రైవర్లతో మాట్లాడతారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్ టీడీపీ నేతలు గుత్తికొండ కిశోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, మాలేపాటి నాగేశ్వరరావు, శాంతకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగుమాటి

నూతన టీడీపీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

అల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరు మండల నూతన టీడీపీ కార్యాలయ భవన భవనానికి శుక్రవారం భూమిపూజ, శంకుస్థాపన చేశారు. సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీదగిరిధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అల్లూరుపేట ప్రాంతంలో టీడీపీ నూతన కార్యాలయ నిర్మాణానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, బండి అమర్‌రెడ్డి, మేడా క్రిష్ణారెడ్డి, సామంతుల కిరణ్‌రెడ్డి, నీలపురెడ్డి హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయ భూపూజలో బీద గిరిధర్

రాష్ట్రంలోని ప్రధాన ఆలయ కమిటీల్లో జిల్లా వాసులు

నెల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల ట్రస్టు బోర్డులను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం, శ్రీకాళహస్తి దేవస్థానాలకు 16 మందితో కూడిన పాలక వర్గాల నియామకానికి ఆమోద ముద్ర వేసింది. ఈ కమిటీల్లో జిల్లాకు చెందిన వారు చోటు దక్కించుకున్నారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యునిగా కావలికి చెందిన ఉప్పుటూరి సుబ్బలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితుడిగా కోవూరుకు చెందిన వేమిరెడ్డి కోటారెడ్డి నియమితులయ్యారు. అలానే శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నెల్లూరు సిటీకు చెందిన కొమరి విజయమ్మను ఎంపిక చేశారు.

అధ్వానంగా డ్రైనేజీ..

రోడ్డుపైనే మురుగునీరు!

కావలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు పోలేరమ్మ అరుగు నుంచి కృష్ణుడి బొమ్మ సెంటర్ వరకు డ్రైనేజీ అధ్వానంగా మారింది. దీంతో మురుగునీరు రోడుపైనే మడుగును తలపిస్తోంది. పాతూరులో అత్యంత రద్దీగా ఉండే ఆ రోడ్డులో డ్రైనేజీ దెబ్బతినడంతో తరచూ మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. చెత్తా చెదారం అడ్డుపడంతో వారం రోజులుగా రోడ్డుపైనే మురుగు నీరు నిలిచిపోయింది. ఎన్నిసార్లు చెప్పినా మున్సిపల్ అధికారులు పట్టించుకోడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడ మురుగునీరు రోడ్డుపై ఉన్నందున పోలేరమ్మఅరుగు, క్రిష్ణమందిరానికి వెళ్లే భక్తులు, మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మున్సిప889ల్ అధికారులు స్పందించి కాలువకు అడ్డుగా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పోలేరమ్మ అరుగు వీధిలో రోడ్డుపై నిలిచిన మురుగు

రేపు జిల్లాస్థాయి యోగాసన పోటీలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా యోగా క్రీడ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన కలివెలపాళెం రెయిన్‌బో పాఠశాలలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులకు అండర్-8, 14, 18, 24, 30, 40, 50, 60 విభాగాల్లో, 60ఏళ్ల పైబడిన వారికి విడిగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 25, 26వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు అసోసియేషన్ కార్యదర్శి ఎంవీ.ప్రసన్నకుమార్‌ను సంప్రదించాలని తెలిపారు.

జీఎస్టీ 2.0తో అన్నివర్గాల ప్రజలకు మేలు

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, ప్రతి కుటుంబానికి రూ. 15వేలు వరకు ఆదా అవుతుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో భాగంగా పట్టణంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంకమ్మ దేవాలయం వద్ద నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాలుగు శ్లాబ్‌లుగా ఉన్న జీఎస్టీని ప్రస్తుతం రెండు శ్లాబ్‌లుగా మార్చారని, దీంతో 83 రకాల వస్తువుల ధరలు తగ్గాయని దీంతో అన్నివర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, జనిగర్ల నాగరాజు, పూరిమెట్ల గురునాథం, రాచగర్ల సుబ్బారావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పోకూరి రాంబాబు, బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాదరావు, జనసేన నాయకులు గోకరాజు మదన్ పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు, కూటమి పార్టీల శ్రేణులు

జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన

ఉలవపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ నూతన సంస్కరణలపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం రైతుసేవా కేంద్రం-3 వద్ద వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ జీఎస్టీ స్లాబ్, జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌ను వివరించారు. వ్యవసాయ ట్రాక్టర్, పనిముట్లు తదితరాలపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతంకు తగ్గించారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

కందుకూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన గురువారం 167బీ జాతీయ రహదారిపై ఓగూరు సమీపంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఉపాధ్యాయుడు అశోక్‌బాబు స్వగ్రామం పలుకూరు కాగా, కావలిలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మోటారుసైకిల్‌పై వెళ్తుండగా గుడ్లూరు మండలం పరకొండపాడుకు చెందిన వారు విజయవాడలో వివాహం చేసుకుని కారులో స్వ గ్రామానికి వస్తుండగా మోటారుసైకిల్‌ను కారు ఢీ కొంది. దీంతో అశోక్‌బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. కారు కూడా అదుపుతప్పి పక్కన ఉన్న పొలాల్లోకి వెళ్లి ఆగింది. అయితే కారులో బెలూన్లు ఓపెన్ కావటంతో కారులోని వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. మృతుడు అశోక్‌బాబుకు భార్య, కుమారుడు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



అదుపుతప్పి పొలాల్లోకి వెళ్లిన కారు

అశోక్‌బాబు (ఫైల్)

సీపీఐ నేతల సంతాపం

ఉపాధ్యాయుడు అశోక్‌బాబు మృతిపట్ల సీపీఐ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. సీపీఐ జాతీయ నాయకుడు రావుల వెంకయ్య, జిల్లా నాయకులు దామా అంకయ్య, నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్‌బాబు, వై ఆనంద్‌మోహన్ తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

నేటి నుంచి కోదండరామస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు



పునః ప్రతిష్ఠ ఉత్సవాలకు ముస్తాబవుతున్న కోదండరామస్వామి ఆలయం

కావలి రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చౌదరిపాలెంలో శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండరామస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ పూజలు శనివారం నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీన సాయంత్రం పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మేధినీపూజ, అంకురార్పణ, 5వ తేదీ ఉదయం యాగశాల ప్రవేశం, కుంభస్థాపన, శ్రీరామ మూలమంత్రం, మంగళస్నానం, మంగళహారతి, సాయంత్రం పంచసూక్త హోమం, లఘుపూర్ణాహుతి, సామూహిక లక్షతులసి దళార్చన తదితర పూజలు జరుగుతాయన్నారు. 6వ తేదీన ఉదయం శ్రీరామ మూలమంత్ర హోమం, కుంభారాధన, కుంభ ఉద్వాసన, సంప్రోక్షణ కుంభాభిషేకాల అనంతరం 11.30కి సీతారాముల కళ్యాణం, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటి సభ్యులు కోరారు.



బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.



రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు



నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, అనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన సయ్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభుత్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు



హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

ఈ భావి వైద్యురాలికి
ఏ కష్టమొచ్చింది!?

- ప్రభుత్వ వైద్యకళాశాలలో వైద్యవిద్యార్థిని ఆత్మహత్య
- కొద్దిసేపటి వరకు సరదాగా గడిపి.. ఆ తర్వాత బలన్మరణం
- మృతురాలిది నంద్యాల జిల్లా
- గుండెలవిసేలా విలపించిన బంధువులు
- వైద్యులు, విద్యార్థులలో ఆందోళన

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏమైందో ఏమోగానీ నెల్లూరులోని ఏసీ సుబ్బా రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఓ వైద్యార్థిని శుక్రవారం బలవన్మరణానికి పాల్పడింది. పోలీ సుల కథనం మేరకు.. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం సంతజూటూరుకు చెందిన కె సంజీవరాయుడు, లక్ష్మీదేవిల కుమార్తె బన్నెల గీతాంజలి నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలలో మొదటి సంవత్సరం మెడిసిన్ చదువుతూ కళాశా ల హాస్టల్లో ఉంటోంది. ఇటీవల థియరీ పరీక్షలు పూర్తవగా, దసరా సెలవుల నేపథ్యంలో గత నెల 28న తన స్నేహితురాలి ఇంటికి తిరుపతికి వెళ్లిం ది. అక్కడ నుంచి 30వ తేదీన సొంతూరు సంతజూటూరుకు గీతాంజలి వెళ్లింది. శుక్రవారం ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఉండటం తో గురువారమే నెల్లూరుకు చేరుకుం ది. శుక్రవారం ఉదయం సహచర విద్యార్థిని హిమ నిందిని త్వరగా ఎగ్జామ్‌కు వెళ్లింది. ఉదయం 9 గంటలకు గీతంజలి టిఫిన్ చేసి స్నేహితురాలి తో సరదాగానే గడిపింది. అయితే ఏం జరిగిందో ఏమోగానీ గీతాంజలి తన గది తలుపునకు గడియ వేసుకుని బెడ్‌పై కుర్చీ వేసి చున్నీతో ఫ్యానుకు ఉరి వేసుకుంది. గీతాంజలి (21) పరీక్షకు వెళ్లకపోవడంతో వసతి గృహ అధ్యాపక సిబ్బంది ఆమె గది వద్దకు వెళ్లి తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా ఎలాంటి అలికిడి రాలేదు. దీం తో వారు తలుపులు బలంగా నెట్టడంతో తెరుచున్నాయి. అప్పటికే గీతాంజలి చున్నీకి వేలాడుతూ కనిపించడంతో వెంటనే దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించా రు. ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్య ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు సాయంత్రానికల్లా నెల్లూరుకు చేరుకుని విగతజీవి గా పడి ఉన్న గీతాంజలిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకు తరలించి ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గీతాంజలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

● అసలేం జరిగి ఉండొచ్చు!

గీతాంజలి ఆత్మహత్య వెనుక తిరుపతిలో ఉన్నప్పుడు ఏమైనా సంఘటనలు జరిగాయా!? అన్న అనుమానం కూడా లేకపోలేదు. మానసిక ఒత్తిడి ఏమైనా ఉందా, థియరీ పరీక్షలు బాగా రాయలేదా? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే అనారోగ్యం కారణంగా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య కళాశాలలో ప్రాక్టికల్స్ ఉండటంతో పంపించామని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఏది ఏమైనా పూర్తిస్థాయిలో విచారించి తమ కుమార్తె మృతికి కారణమేమిటో స్పష్టం చేయాలని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ దిశగా పోలీసులు విచారణ ప్రారంభించారు.

రౌడీషీటర్ రాముపై
పీడీ యాక్ట్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వరుస నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్ గోని రాముపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం అంబేద్కర్ కాలనీకి చెందిన గోని రాము ప్రస్తుతం ఉడ్‌హౌస్ సంఘంలో ఉంటున్నాడు. అతనిపై రెండు హత్య, ఆరు హత్యాయత్నం, రెండు దాడి దోపిడీ, రెండు దొంగతనాలు, మూడు దాడి కేసులున్నాయి. నవాబుపేట పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఇలా వరుసగా నేరాలకు పాల్పడుతూ పలుమార్లు జైలుకు వెళ్లివచ్చాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. పలు మార్లు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా అతని తీరులో మార్పు రాకపోవడంతో పోలీసు అధికారులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. ప్రస్తుతం ఆయన జిల్లా కేంద్ర కారాగారంలో ఓ కేసులో రిమాండ్‌లో ఉండగా నవాబుపేట పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

కన్న కొడుకునే హతమార్చిన కసాయి తండ్రి

- తల్లిని కొట్టొద్దన్నందుకు దారుణం

విడవలూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో కన్న కొడుకునే ఓ తండ్రి హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం విడవలూరు మండలం ముదివర్తి బీసీ కాలనీలో తాండ్ర రవికుమార్, సుప్రజ దంపతులు నివసిస్తున్నారు. వారికి ఒక్కడే కొడుకు ప్రేమ్ చంద్ (19). రవికుమార్ నిత్యం భార్యను హింసించేవాడు. తండ్రీకొడుకులిద్దరూ తరచూ పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చేవారు. ఆ మత్తులో రవికుమార్ భార్యను కొట్టేవాడు. తల్లిని కొట్టొద్దని ప్రేమ్‌చం ద్ అడ్డుకునేవాడు. ఇదిలా ఉండగా ప్రేమ్‌చంద్ గురువారం విజయదశమి సందర్భంగా పూటుగా మద్యం సేవించి రా త్రి బాగా పొద్దుపోయాక ఇంటికి చేరుకున్నాడు. మద్యం మత్తు వదలకపోవడంతో శుక్రవారం మధ్యాహ్నం వరకు నిద్రపోయాడు. ఆ సమయంలో తండ్రి రవికుమార్ రోకలి బండతో కొడుకు తలపై బలంగా కొట్టాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు, సీఐ సురేంద్ర బాబు, ఎస్ఐ నరేష్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్యను కొట్టకుం డా అడ్డుకుంటున్న కుమారుడిపై కక్ష కట్టిన రవికుమార్ ఈ దారు ణానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. కన్న తండ్రే కాల మయుడై కొడుకును హత్యచేయ డంతో ముదివర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ప్రేమ్‌చంద్ మృతదేహం

మెరుగైన సాగుకు
పొలం పిలుస్తోంది!

- నాట్ల నుంచి కోతల వరకు ప్రత్యేక అవగాహన
- అన్నదాతలకు విలువైన సూచనలు, సలహాలు
- అందుబాటులో వ్యవసాయ అధికారులు
- ప్రతీ మంగళ, బుధవారాల్లో సదస్సులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో మార్పులు.. అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానంతోపాటు ఎరువుల వినియోగం, ప్రకృతి సేద్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. 'పొలం పిలుస్తోంది' పేరుతో గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించడంతోపాటు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి చీడపీడల నివారణపై వ్యవసాయశాఖ అధికారులు పలు సూచనలు, సలహాలు అందిస్తూ రైతులతో భాగస్వాములవుతున్నారు.

● వారంలో రెండ్రోజులు..

వ్యవసాయంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ప్రతీ మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమం నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసింది. విత్తనం నాటే దగ్గర నుంచి పంట చేతికందే వరకు ప్రతి దశలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందు బాటులో ఉండడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ క్రమంలో వ్యవసా య అధికారులు రోజుకు రెండు గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి వారి అనుమానాలను నివృత్తి చేస్తున్నారు.



చేజర్ల మండలంలో రైతులతో మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి, పక్కన వ్యవసాయ అధికారులు(ఫైల్)

ఈ విధం గా వారానికి నాలుగు గ్రామాల్లో, నెలకు 16 గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

● ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

'పొలం పిలుస్తోంది'లో భాగంగా పంటల సాగులో మెలకువలు, ఎరువుల వినియోగంపై రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందుల వాడకంతో కలిగే నష్టాలను రైతులకు వివరిస్తున్నారు. అదే సమయంలో ప్రకృతి వ్యవసాయం వల్ల పొందే లాభాలనూ తెలియజేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి, లోపాలను గుర్తించి నివారణ చర్యలను వివరి స్తున్నారు. సూక్ష్మపోషకాల లో పాలను గుర్తించి, భూసారం పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలను చెబుతున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పెట్టుబడి తగ్గించి దిగుబడి పెంచుకునేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది. వారంలో రెండ్రోజులు నాలుగు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించి రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- పీ సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

పాతకక్షలతో యువకుడి దారుణ హత్య

- బైక్‌ను బలంగా ఢీకొన్న కారు
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

గుడ్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు మండలం దారకానిపాడులో దారుణం జరిగింది. పాతకక్షలతో ఓ యువకుడిని హత్య చేశారు. గ్రామస్తులు, పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. దారకానిపాడు గ్రామానికి చెందిన కాకర్ల హరిచంద్రప్రసాద్ అనే వ్యక్తితో, అదే గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు అనే యువకుడికి విభేదాలున్నాయి. ఈ ఏడాది వినాయక విగ్రహ నిమజ్జనం విషయంతోపాటు ఆర్థికపరమైన, వ్యక్తిగత వివాదాలు నడుస్తున్నాయి. ఇటీవల గుడ్లూరు, కందుకూరు పోలీస్‌స్టేషన్లలో పరస్పరం ఫిర్యాదులు కూడా చేసుకొని ఉన్నారు. అయితే గురువారం కందుకూరు నుంచి దారకానిపాడుకు కారులో వస్తున్న హరిచంద్రప్రసాద్‌కు, దారకానిపాడు నుంచి కందుకూరుకు ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై వెళుతూ రాళ్లపాడు దగ్గర ఎదురుపడ్డారు. బైక్‌ను లక్ష్మీ నాయుడు నడుపుతున్నాడు. ఇద్దరి మధ్య పాతవివాదాలు ఉన్న నేపథ్యంలో ఇదే అదునుగా భావించిన హరిచంద్రప్రసాద్ బైక్‌ను కారుతో వేగంగా ఢీ కొట్టాడు. దీంతో ద్విచక్రవాహనం నడుపుతు న్న లక్ష్మీ నాయుడు (29) అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై వెనుక వైపు కూర్చొని ఉన్న తిరుమలశెట్టి పవన్, తిరుమలశెట్టి భార్గవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని తొలు త 108 అంబులెన్స్‌లో కందుకూ రు ఏరియా వైద్యశాలకు తరలిం చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లారు. గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్ఐ వెంకట్రావ్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. క్షతగాత్రుల్లో ఒకరైన పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమగ్ర దర్యాప్తు చేస్తామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే కారుతో గుద్ది చంపేశారని దొరకానిపాడు గ్రామస్తులతోపాటు, మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా, లక్ష్మీ నాయుడుకు భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కందుకూరు వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం శుక్రవారం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.



లక్ష్మీ నాయుడు మృతదేహం



కారు బలంగా ఢీకొనడంతో రోడ్డు పక్కన పడిపోయిన యువకులు



ప్రమాదానికి కారణమైన కారు